

బార్లకు దరఖాస్తుల గడువు పెంపు

- 17వ తేదీ వరకు స్వీకరణ.. 18న లాటరీ

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బార్లకు దరఖాస్తుల గడువును రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసలునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని, 18న ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లో లాటరీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వారంలో 2 రోజులే!

- మిగిలిన ఐదు రోజులూ మూతే!
- జిల్లాలో తెరుచుకోనంటున్న గ్రంథాలయాలు
- ఉద్యోగుల కొరతే ప్రధాన కారణం
- 140 మందికి ఉన్నది 40 మందే!
- ఒక్కొక్కరికి 2, 3 చోట్ల ఇన్‌చార్జ్ బాధ్యతలు
- పనిభారంతో సతమతం.. పట్టించుకోని అధికారులు



ఇది సంగం మండలం అన్నారెడ్డి పాళెం శాఖా గ్రంథాలయం. ఇక్కడున్న గ్రంథాలయాధికారి జూన్‌లో నెల్లూరుకు బదిలీ అయ్యారు. మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఈ పోస్టు భర్తీ కాలేదు.



సంగంలోని గ్రంథాలయాధికారి జూలై నెలాఖరులో ఉద్యోగ విరమణ చేశారు. అప్పటినుంచి నెలా 10 రోజుల మూత పడింది. రెండ్రోజుల క్రితం ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన లైబ్రేరియన్ వచ్చారు. ఇక నుంచి వారంలో బుధ, గురువారాలలో మాత్రమే గ్రంథాలయ తలుపులు తెరుచుకుంటాయి. మిగతా రోజులు మళ్లీ మూతే. జిల్లాలో అన్ని గ్రంథాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

జిల్లాలో గ్రంథాలయ సంస్థను సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో ఒక్కొక్కరికి రెండు, మూడు చోట్ల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నారు. వారు ఏ ఒక్క గ్రంథాలయానికీ న్యాయం చేయలేక వారానికి రెండు రోజులు ఒకచోట, మరో రెండు రోజులు మరో గ్రంథాలయంలో విధులు నిర్వహించాల్సిన వస్తోంది. దీంతో మిగతా రోజుల్లో గ్రంథాలయాలు మూత పడుతున్నాయి. జిల్లాలో 61 శాఖా గ్రంథాలయాలు, ఒక జిల్లా గ్రంథాలయం ఉంది. ఉన్నాయి. మొత్తం 140 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం 40 మంది మాత్రమే ఉన్నారు. 1993 నుంచి గ్రంథాలయల్లో కొత్తగా సిబ్బందిని నియమించలేదు. ఉన్నవారు ఉద్యోగ విరమణ పొందుతూ చివరకు జిల్లావ్యాప్తంగా 40 మంది మిగిలారు. జిల్లా ప్రధాన గ్రంథాలయంలో ఉన్న ఎల్‌డీసీ, యూడీసీ, జూనియర్, సీనియర్, రికార్డ్ అసిస్టెంట్లకు సైతం పక్క నున్న శాఖా గ్రంథాలయాలకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.


● నిరుద్యోగులు, పాఠకుల అవస్థలు

పుస్తక బాండాగారాలుగా పేరుగాంచిన గ్రంథాలయాలపై ఎంతో మంది పేద నిరుద్యోగ యువకులు, విద్యార్థులు ఆధారపడి ఉన్నారు. పోటీ పరీక్షలకు పుస్తకాలు, పేపర్లు కొనుగోలు చేయలేక గ్రంథాలయాలకు వచ్చి చదువుకుని తర్ఫీదు పొందుతుంటారు. అయితే, గ్రంథాలయాలు సరిగా తీయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కార్పొరేషన్, మున్సిపల్ కేంద్రాల్లో ఫర్వాలేదనిపించినా, మండల కేంద్రాల్లో మాత్రం వారంలో రెండురోజులు మాత్రమే తలుపులు తెరుచుకుంటున్నాయి. అంతేగాక క్రమం తప్పకుండా గ్రంథాలయాలకు వచ్చే పాఠకులు పుస్తకాలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, జిల్లా అధికారులు స్పందించి గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

గ్రంథాలయ సెస్సు బకాయిలు రూ.47.91 కోట్లు

- ఇరవై ఏళ్లుగా పేరుకుపోయిన అప్పు
- కార్పొరేషన్‌దే రూ.41.47 కోట్లు



నెల్లూరు (సాంస్కృతికం) : జిల్లా గ్రంథాలయ సంస్థకు స్థానిక సంస్థలు, ప్రజల నుంచి వసూలు చేసిన గ్రంథాలయ సెస్సు బకాయిలు రూ.47,91,91, 664 ఉన్నాయి. వీటి వసూలుపై అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఏడాదికేడాది కొండలా పేరుకుపోతున్నాయి. సుమారు 20 ఏళ్లగా వసూళ్లపై దృష్టి పెట్టకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. నెల్లూరు నగర పాలక సంస్థ, కావలి, గూడూరు, ఆత్మకూరు, వెంకటగిరి, నాయుడుపేట, బుచ్చిరెడ్డి పాలెం, అల్లూరు నగర పంచాయతీలతోపాటు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు 2004 వ నుంచి 2025 వరకు బకాయిలు ఉన్నాయి. నెల్లూరు నగర పాలక సంస్థ రూ.41,47,27,891, కావలి రూ.1,19,46,384, గూడూరు రూ.87,62,092, ఆత్మకూరు రూ.50,27,005, వెంకటగిరి రూ.45,86,000, నాయుడుపేట రూ.26,28,826, బుచ్చిరెడ్డిపాలెం రూ.11,52, 043, అల్లూరు రూ.2,43,000, జిల్లావ్యాప్తంగా 961 పంచాయతీల నుంచి రూ.3,01,18,423 వసూలు కావాల్సి ఉంది. గ్రంథాలయ సెస్సులు ఆయా సంస్థల వద్ద ఉండిపోవడంతో జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లాలోని శాఖా గ్రంథాలయాల అభివృద్ధికి ఆటంకాలుగా మారిపోయింది.

వసూళ్లపై దృష్టి పెట్టాలి

సెస్సు బకాయిల వసూళ్లపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టాలని యని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థలు విశ్రాంతి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీనాథరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. నగరంలోని గ్రంథాలయ భవన నిర్మాణం నిధులు

- మిగతా 7లో..

ప్యాకేజీ-1పై విచారణ ముమ్మరం

- అనేక అవకతవకలను గుర్తించిన విజిలెన్స్ అధికారులు
- ఫైనల్ బిల్లు సమయంలోనే జరిగినట్లు నిర్ధారణ
- అప్పట్లో పనిచేసిన అధికారుల వివరాలు ఇవ్వాలని లేఖ
- వారందరినీ బాధ్యులను చేసేందుకు సిద్ధం
- త్వరలో ప్రభుత్వానికి చేరనున్న నివేదిక
- ఎట్టకేలకు కౌంటర్ వేసిన నీటిపారుదల శాఖ



పెన్నా డెల్టా ఆధునికీకరణ ప్యాకేజీ-1 పనులపై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనా!? విజిలెన్స్ విచారణలో అవకతవకలు బయటపడ్డాయా!? అంటే విశ్వసనీయ వర్గాల నుంచి అవుననే సమాధానం వినిపిస్తోంది. ఫైనల్ బిల్లు సమయంలోనే మొత్తం తతంగమంతా నడిచినట్లుగా విజిలెన్స్ గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఫైనల్ బిల్లు చేసి ప్రీక్లోజ్ చేసిన సమయంలో పనిచేసిన అధికారుల వివరాలన్నీ ఇవ్వాలంటూ తాజాగా విజిలెన్స్ ఎస్పీ నుంచి ఇరిగేషన్ ఎస్ఈకు లేఖ అందడం చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 17వ తేదీలోపు అధికారుల పేర్లు అందజేస్తే విచారణ త్వరగా ముగిస్తామని ఈ లేఖలో పేర్కొన్నారు. దీనిని బట్టి చూస్తుంటే ప్యాకేజీ-1 వర్కుల్లో అవకతవకలు గుర్తించారని, అందుకు బాధ్యులైన అధికారులపై చర్యలకు సిఫార్సు చేసేందుకే వివరాలు అడుగుతున్నారని ఇరిగేషన్ వర్గాలు చెబుతున్నాయి. జూన్ నెలలో విచారణ ప్రారంభించిన విజిలెన్స్ అధికారులు దాదాపుగా విచారణ పూర్తి చేసినట్లు సమాచారం. మూడు నెలల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించడమేగాక అనేక రికార్డులను తనిఖీ చేశారు. మరో నెల రోజుల్లోపు ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు విజిలెన్స్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

8



నిండుకుండలా ఉన్న సోమశిల జలాశయం

సోమశిల నుంచి ఏ క్షణాన్నైనా నీటి విడుదల

- డ్యాంలో 72.250 టీఎంసీల నిల్వ

అనంతసాగరం సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాయశం నుంచి వరద ప్రవాహం పెరుగుతుండటంతో ఏ క్షణాన్నైనా దిగువకు నీటి విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 21,480 క్యూసెక్కుల నీరు వస్తుండగా, డ్యాంలో 72.250 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,850, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 9,450 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేయనుండటతో పెన్నా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈఈ శ్రీనివాసరావు తెలిపారు.

● కండలేరులో 44 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు డ్యాం నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుతం 44.420 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు ఏఈ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 9వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుండగా, 1685 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉందని తెలిపారు.

● సంగంలో తగ్గిన నీటిమట్టం

సంగం బ్యారేజీ నుంచి శుక్రవారం పెన్నానదికి 2,825 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో బ్యారేజీ నీటిమట్టం 11.8 అడుగుల నుంచి 11.2 అడుగులకు తగ్గింది. ప్రస్తుతం బ్యారేజీకి 3,725 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. బ్యారేజీకి చేరుతున్న నీటిలో బెజవాడ పాపిరెడ్డి (కావలి) కాలువకు 575 క్యూసెక్కులు, కనుపూరు కాలువకు 200 క్యూసెక్కులు, కనిగిరి రిజర్వాయర్ కాలువకు 30 క్యూసెక్కులు, పెన్నానది దిగువకు 2825 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

కొన్నట్లు నటిస్తూ.. నగలు కొట్టేస్తూ.. బంగారం దొంగతనం చేస్తూ పట్టుపడిన కి'లేడీ'లు 6

అత్యాధునికంగా అత్యవసర సేవ!

- అందుబాటులోకి ఏఎల్ఎస్ అంబులెన్స్‌లు



ఉదయగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర సమయాల్లో గంటలోపు వైద్యసేవలు అందిస్తే ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చు. గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించడం ఎంతో అవసరం. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక పరికరాలు, సదుపాయాలున్న అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు (ఏఎల్ఎస్) 108 అంబులెన్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. వైద్యశాలకు వెళ్లేలోపు వాహనంలో ఉన్న సీసీ కెమెరాల సహకారంతో ఎమర్జెన్సీ రెస్పాన్స్‌బుల్ సర్వీసెస్ వైద్యుడి సలహాలు తీసుకుంటూ సేవలు అందించి రోగి ప్రాణాలను కాపాడవచ్చు. ఏఈడీ (ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డీఫిబ్రిలేటర్), మల్టీ పారా మానిటర్, వెంటిలేటర్ తదితర అత్యాధునిక పరికరాలు అంబులెన్స్‌లో ఉన్నాయి. ఇప్పటికే ఆత్మకూరు, కందుకూరు, నెల్లూరు, కావలి ప్రాంతాల్లో ఏఎల్ఎస్, మిగిలిన ప్రాంతాల్లో బీఎల్ఎస్ అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి. 108 వాహనాల జిల్లా మేనేజర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆధునిక పరికరాలున్న అంబులెన్స్‌లు మరో మూడు జిల్లాకు రానున్నాయని తెలిపారు.

నేడు కొత్త కలెక్టర్ హిమాన్షు శుక్లా బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నూతనంగా కలెక్టర్‌గా నియమితులైన హిమాన్షు శుక్లా శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన హిమాన్షు శుక్లా ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ నెల్లూరు కలెక్టర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. కాగా, ఇక్కడున్న ఆనంద్ అనంతపురానికి బదిలీ అవగా, శుక్రవారం తన బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, పలువురు అధికారులు, నాయకులు ఆనంద్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

కబ్జా చేసినా.. కిమ్మనలేదు!

- సూరాయపాలెంలో ప్రభుత్వ భూమి ఆక్రమణ
- ఆధారాలతో సహా తేల్చిన రెవెన్యూ అధికారులు
- ఇప్పటికీ ఆక్రమణలు తొలగించని వైనం

పొదలకూరు మండలం సూరాయపాలెంలో కబ్జాకు గురైన 36 ఎకరాల మేత పోరంబోకు భూముల విషయంలో రెవెన్యూ యంత్రాంగం మెతకవైఖరిని ప్రదర్శిస్తోంది. ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లు స్వయంగా తహసీల్దార్ వెళ్లి నిర్ధారించినా చర్యలు తీసుకోవడంలో మాత్రం వెనకడుగు వేస్తున్నారు. సుమారు రూ.7 కోట్ల విలువైన ఈ భూమి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ఇంకా అక్రమార్కుల చెరలోనే ఉండటం గమనార్హం.

8

మా ఫ్యాన్లు కొనండి.. తక్కువ వడ్డీకే రుణాలిస్తాం!

- నాణ్యతలేని ఫ్యాన్లు అంటగట్టి బురిడీ
- దుత్తలూరులో లబోదిబోమంటున్న బాధితులు

దుత్తలూరు (ఉదయగిరి), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మోసపోయే వాళ్లు ఉన్నంతకాలం మోసం చేసేవాళ్లు పుట్టగొడుగుల్లా పుడుతూనే ఉంటారు. పేదలు, అమాయకులు వారి మాటలు నమ్మి ఏదో ఒక రూపంలో మోసపోతుంటారు. తీరా మోసపోయామని గ్రహించేలోపే మోసం చేసినోళ్లు పత్తా ఉండరు. ఇలాంటి సంఘటనే దుత్తలూరు మండలంలో వెలుగులోకి వచ్చింది. దుత్తలూరు మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలకు నెల రోజులుగా ఇద్దరు వ్యక్తులు తిరుగుతూ తాము లక్ష్మీ ఫైనాన్స్ అనే సంస్థ ఏర్పాటు చేశామని, అతి తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నాంటూ పల్లెవాసులను నమ్మించారు. అయితే, ముందుగా తమ వద్ద ఫ్యాన్లు తీసుకోవాలని సూచించారు. రుణం వస్తుందనే ఆశతో పలువురు ఒక్కో ఫ్యాన్‌ను రూ.3,200 చొప్పున కొనుగోలు చేశారు. ఫ్యాన్ తీసుకున్న వారికి తక్కువ వడ్డీతో రూ.50 వేల రుణం త్వరలో ఇస్తామని, వాయిదాల పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుందని, ఫొటోలు, పత్రాలతో సిద్ధంగా ఉండాలని నమ్మపలికారు. అయితే, రోజులు గడుస్తున్నా ఆ వ్యక్తులు రాకపోవడం, ఫోన్లు పని చేయకపోయడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు లబోదిబోమంటున్నారు. ఫ్యాన్లు సైతం ఒక్కొక్కటి రూ.1,200 కంటే ధర పలకది, అది కూడా సక్రమంగా పని చేయడంలేదని వాపోతున్నారు. అయితే, బాధితులు మాత్రం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఇలాంటి మోసగాళ్లపై పోలీసులు నిఘా ఉంచి, వారి ఆగడాలను అరికట్టాలని పల్లెవాసులు కోరుతున్నారు.



బాధితులకు అంటగట్టిన నాసిరకం ఫ్యాన్లు ఇవే!

ప్రతీ పల్లెకూ త్రీ ఫేజ్!

- పనులను వేగవంతం చేయండి
- అధికారుల సమీక్షలో విద్యుత్ సీఎండీ సంతోష్‌రావు

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రతీ పల్లెకు త్రీఫేజ్ కరెంట్‌ను త్వరలో ఏర్పాటు కానున్నదని విద్యుత్ శాఖ సీఎండీ సంతోష్‌రావు తెలిపారు. శుక్రవారం నెల్లూరులోని ఓ కల్యాణమండపంలో సిటీ, రూరల్, కోవూరు డివిజన్ అధికారులతో సీఎండీ సమీక్షించారు. ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా త్రీఫేజ్ ఏర్పాటు చేసే పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లా, మండల కేంద్రాల్లో నివాసం లేని ఉద్యోగులకు టీఏ బిల్లులు మంజూరు చేయవద్దని సూచించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని తెలిపారు. పీఎం సూర్యఘర్ సోలార్‌కు సంబంధించి ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ఇప్పటికే రిజిస్ట్రేషన్లు పూర్తయినందున వారినుంచి అంగీకార పత్రాలను త్వరగా త్వరగా తీసుకోవాలన్నారు. అలాగే బీసీ వర్గాలకు రూ.20 వేలు అదనంగా సబ్సిడీ ఇవ్వనున్నారని, దీనిపై విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ఇక వ్యవసాయ కనెక్షన్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, వెంటనే సర్వీసులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డైరెక్టర్ గురవయ్య, ఎస్ఈ విజయన్, ఈఈలు సోమశేఖర్‌రెడ్డి, శ్రీధర్, రమేష్‌చౌదరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ సీఎండీ సంతోష్‌రావు

బతికించే తొలి వైద్యం

- ప్రథమ చికిత్సకు ఎంతో ప్రాధాన్యత
- ఎందరివో ప్రాణాలను నిలబెట్టిన సందర్భాలు
- పరిశ్రమల సిబ్బందికి తర్ఫీదు ఎక్కడ..?

నేడు ప్రపంచ ఫస్ట్ ఎయిడ్ డే - వివరాలు 8లో..

వెంకటాచలంలో ఆక్వా రైతులకు అవగాహన

వెంకటాచలం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలో శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆక్వా రైతులు, సొసైటీ సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్స్యశాఖ సహాయ పరిశీలకులు ఏ పొట్టయ్య మాట్లాడుతూ మండలంలో ఐదు మత్స్య సహకార సంఘాలు ఉన్నాయని, అందులో 766 మంది సభ్యులుగా ఉన్నట్లు తెలిపారు. ఆక్వా సాగు చేసే ప్రతీ ఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలని, లేదంటే కరెంటు సబ్సిడీ వర్తించద న్నారు. మత్స్య శాఖ సహాయకులు సయ్యద్ షేహ తాజ్, షేక్.షామిల్ పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10469
వెండి కిలో ధర	రూ. 132600
వెండి ఒక గ్రాము	రూ. 135.60

సామూహిక కుంకుమార్చన



పల్లకీలో ఊరేగుతున్న కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం రాత్రి కామాక్షితాయికి సామూహిక కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పల్లకీ సేవలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో గంగా, కామాక్షి సమేత శ్రీ మల్లికార్జున స్వామికి పురోహితులు చేసిన నిత్య కళ్యాణోత్సవం అలరించింది. భక్తులకు భోజన వసతి కల్పించారు.

లింగాయపాలెంలో ఉచిత వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ముత్తుకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాయపాలెంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఇళ్లు, పరిసర ప్రాంతాలలో మురుగునీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ అమృత, ఏఎన్‌ఎంలు భారతి, బీనాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అధిక యూరియా వాడకంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

మనుబోలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురివిందపూడి గ్రామంలో అధిక యూరియా వాడకం తగ్గించాలంటూ శుక్రవారం వ్యవసాయాధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా. శివజ్యోతి, డా. కిరణ్ కుమార్, వ్యవసాయాధికారి వెంకట కృష్ణయ్య, టీడీపీ నాయకులు సుధీర్ రెడ్డి, శివకుమార్ శర్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మనుబోలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ అనిల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

పరుచూరు నారయ్యకు ఘన నివాళి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

కోవూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పడుగుపాడు రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకుడు పరుచూరు నారయ్య చిత్రపటానికి సీపీఎం నాయకులు, కార్మికులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. పడుగుపాడు రైల్వేస్టేషన్ ఎదురుగా సుందరయ్య భవన్ పక్కనే నిర్మించిన హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యాలయ భవనాన్ని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి మూలం రమేష్ ప్రారంభించారు. ఐదవ వర్ధంతి సందర్భంగా హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యాలయ భవనాన్ని ఆయన పేరుతో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. హమాలీలకు ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జీ నాగేశ్వర రావు, తుళ్ళూరు గోపాల్, గోగుల శ్రీనివాస్, టీవీవీ ప్రసాద్, కే శ్రీనివాసులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ఆత్మకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి వేడుకలను తెలుగుభారతి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మేధా ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, పద్య పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అపస్మా గౌరవాధ్యక్షుడు టీసీ వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కమిటీలు.. ప్రతిభను వెలిగించే దివిటీలు!

- విద్యాభివృద్ధికి మరో అడుగు
- మండల కమిటీల ఏర్పాటు
- పనితీరు, రికార్డులు పరిశీలన

మనుబోలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నూతన విద్యావిధానంలో భాగంగా మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తోంది. కమిటీల నివేదికల ఆధారంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ప్రైవేట్ పాఠశాలల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు ఈ విధానాన్ని ఏపీ సర్కారు అమలు చేస్తోంది.

కమిటీలో సభ్యులుగా ఎవరుంటారంటే...

మండలస్థాయి కమిటీల్లో మండల విద్యాశాఖాధికారులు (ఎంఈవోలు), నాలుగు క్లస్టర్ల ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల్లో పలు సబ్జెక్టుల నిపుణులైన 7 మంది ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు 5 మంది ఉంటారు. వీరంతా వారానికి రెండుసార్లు మండలంలోని పాఠశాలలను పరిశీలిస్తారు.

ఎవరెవరు ఎలా అంటే...

ఎంఈవో, ఇద్దరు కాంపెక్స్ ప్రధానోపాధ్యాయులు, హైస్కూల్ సబ్జెక్టు టీచర్లు ఉన్నత పాఠశాలలను సందర్శిస్తారు. అలాగే ఎంఈవో- 2, ఇద్దరు క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, 5 మంది ప్రాథమిక ఉపాధ్యాయులు స్థానిక మోడల్ ప్రాథమిక పాఠశాలలను పరిశీలిస్తారు. ఈ పరిశీలనకు ముందురోజే ఎంఈవో సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సమాచారం అందిస్తారు. ఆరోజు ఆ పాఠశాలలో ఎంతమంది ఉపాధ్యాయులు పని చేస్తుంటారో అంతమంది సెలవు పెట్టడానికి వీలు లేదు. అందరూ తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది.



మనుబోలు బాలుర ఉన్నత పాఠశాల

పరిశీలన ఇలా...

- ఈ పరిశీలన సమయంలో ప్రధానోపాధ్యాయులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ముందుగానే రికార్డులను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది.
- విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, సమయం, సిలబస్ జరిగిన తీరు పరిశీలిస్తారు.
- పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్ నోట్‌బుక్స్ దిద్దిన తీరు
- ప్రతి శనివారం నో బ్యాగ్ డే అమలుతీరు, అకడమిక్ క్యాలెండర్లో సూచించిన విధంగా కృత్యాల పుస్తకం ఉందా? లేదా? చూస్తారు.
- అభ్యసన ఫలితాలు ఏ మేరకున్నాయో చూస్తారు.
- అసెస్మెంట్ పుస్తకాల పరిశీలన, ఆన్‌లైన్‌లో నమోదు తీరు
- ఎన్‌రోల్‌మెంట్ పెంచడంపై చేసిన కృషి
- ఎంతమందికి అపార్ ఐడీ అందింది ? ఎంతమందికి అందలేదు?
- విద్యార్థులు పాఠశాలలకు హాజరు కాకపోవడానికి గల కారణాలపై ఆరా
- హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు పరిశీలన
- మధ్యాహ్న భోజనం అమలు తీరు పర్యవేక్షణ
- పాఠశాలలో అన్ని రిజిస్టర్లు, రికార్డుల పరిశీలన
- యూనిఫాం, బెల్టు, షూ విద్యార్థులంతా ధరించారా? లేదా? పరిశీలిస్తారు.
- పాఠశాల నిధులు నిబంధనల ప్రకారం వినియోగమవుతున్నాయా? లేదా? అనే అంశంపై ఆరా
- తరగతుల్లో విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నారో గుర్తించి విజిటింగ్ రిజిస్టర్‌లో రాశారా? లేదా? పరిశీలిస్తారు.
- ఫార్మెటివ్ వన్, అసెస్మెంట్ మార్కుల నమోదు, తదితర అంశాల ప్రస్తావన.

కమిటీలు వేయడం మంచిదే...



ప్రభుత్వం ఆదేశించిన మేరకు ఇది వరకే మండల స్థాయి కమిటీలను వేశాం. ఎవరెవరన్నది నిర్ణయించి ప్ర భుత్వానికి నివేదిక పంపాం. కమిటీలు ఉండడం మంచిదే. ఇంకా కమిటీ లపై తదుపరి ఉత్తర్వులు రాలేదు. వచ్చిన తరువాత కమిటీలకు శిక్షణ ఇస్తారని అనుకుంటున్నా. తరువాత పాఠశాలలపై కమిటీల పర్యవేక్షణ ఉండబోతుంది.

\- రమేష్‌కుమార్, ఎంఈవో-2

ఓ వైపు అభివృద్ధి.. మరోవైపు సంక్షేమం

- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమాన్ని ఏక కాలంలో అమలు చేసే పాలనా దక్షత ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్నాయని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. మండలంలోని జగదేవిపేటలో రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవం, రూ.50 లక్షల నుడా నిధులతో నిర్మించనున్న డ్రైన్ల నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. జగదేవిపేట కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. రూ. 50 లక్షల 15 ఆర్థిక సంఘ నిధులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డితో కలిసి శుక్రవారం జగదేవిపేట గ్రామ పరిధిలో రూ.50 లక్షల నుడా నిధులతో డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సీఎం చంద్రబాబు కార్యదక్షుడని కొనియాడారు. చంద్రబాబు నాయకత్వంలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పల్లె పండుగ పేరుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గుంతల రహిత రాష్ట్రంగా మార్చిన ఘనత ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌దేనన్నారు. విజయదశమి కానుకగా ప్రభుత్వం ఆటో సోదరులకు రూ.15వేల ఆర్థిక సహాయం అందించబోతున్నట్లు ఆమె తెలిపారు. జగదేవిపేటకు మౌలిక సదుపాయాలు కల్పిస్తానని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని దశల వారీగా అమలు చేస్తానన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపులో జరిగిన అవకతవకలను సరిదిద్ది త్వరలోనే పేదల సొంతింటి కలను సాకారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, రావెళ్ల వీరేంద్రనాయుడు, చెంచు కిశోర్‌యాదవ్, ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, షేక్ ఇంతియాజ్ స్థానిక టీడీపీ నాయకులు కూకటి వెంకటేశ్వర్లురెడ్డి, కుదురు రాధాకృష్ణారెడ్డి, కుదురు చంద్రారెడ్డి, బొల్లినేని రవి నాయుడు, హరి నాయుడు, మల్లికార్జున నాయుడు, పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

కోవూరు : నియోజకవర్గ పరిధిలో 'నుడా' నిబంధనల్ని పాటించకుండా ఏర్పాటు చేసుకున్న అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. స్థానిక పీవీఆర్ కళ్యాణమండపంలో శుక్రవారం జరిగిన లే అవుట్ రెగ్యులైజేషన్ స్కీమ్ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అనధికార లే అవుట్లతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతుందన్నారు. ప్లాట్ల యజమానులు కూడా నష్టపోతారనీ చెప్పారు. 7 శాతం అపరాధ రుసుం వసూలు చేయడంలో అధికారులు దృష్టి పెట్టాలన్నారు. రియల్టర్లతోపాటు ప్లాట్ల యజమా నులు కూడా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ సదస్సులో జాయింట్ కలెక్టర్ కార్తీక్, 'నుడా' చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, జడ్పీ వైస్‌చైర్మన్ శ్రీహరికోట విజయలక్ష్మి, పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, ఎంపీపీ టీ పార్వతి, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నమోదులో

సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ కీలకం

- సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శోభారాణి



మాట్లాడుతున్న డీడీ శోభారాణి

పొదలకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్ విద్యార్థులు ఫీజు రీయంబర్స్‌మెంట్ పొందడానికి సిక్స్ స్టెప్ వెరిఫికేషన్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ కీలకమని జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ కె శోభారాణి అన్నారు. శుక్రవారం స్థానిక విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో 6 మండలాల హాస్టల్ వెల్ఫేర్ అధి కారులు, ప్రభుత్వ, ప్రైవేటు, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సచివాలయాల సిబ్బందితో ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 2025 -26 ఫ్రెష్ అడ్మిషన్స్ 15,364కు గాను 427 మాత్రమే అయ్యాయని, మిగిలినవి పూర్తి చేయాలన్నారు. రెన్యూవల్స్ 32,459 మందికి గాను 26,915 మాత్రం పూర్తయ్యాయని తెలిపారు. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పోస్ట్‌మె ట్రిక్ హాస్టల్‌లో ఉన్నవారికి నెలకు రూ.1600 చొప్పున సంవత్సరానికి రూ.16 వేలు వస్తుందన్నారు. జిల్లాలో 72 హాస్టళ్లకు గాను 69 హాస్టళ్లు సక్రమంగా నడుస్తున్నాయన్నారు. కందుకూరు, మనుబోలు హాస్టళ్లకు రూ. 3 కోట్లు మంజూరైందన్నారు. పొదలకూరు బాలికల హాస్టల్ ప్రతిపాదనలో ఉందన్నారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారికి జర్మన్ లాంగ్వేజెస్ నేర్పించి ఇతర దేశాల్లో మూడున్నర లక్షల జీతం పొందేలా 8 నెలలపాటు శిక్షణ ఇస్తామ న్నారు. కార్యక్రమంలో పొదలకూరు ఏఎస్‌డబ్ల్యూఓ బ్యూటీ హెచ్ సుధామణి, ఆరు మండలాల హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎం.సుధాకర్‌రెడ్డి, జీఎన్ రెడ్డి, సుబ్బారావు, హనుమంతరావు, కోటి, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర మిషన్ డైరెక్టర్‌గా కల్పనారెడ్డి



డైరెక్టరుగా ప్రమాణ స్వీకారం చేసిన కల్పనారెడ్డి

ముత్తుకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ముత్తుకూరు మండలం దమ్మాయిపాలెంకు చెందిన టీడీపీ నాయకురాలు సన్నారెడ్డి కల్పనారెడ్డి స్వచ్ఛ ఆంధ్ర మిషన్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి నారాయణ, స్వచ్ఛ ఆంధ్ర మిషన్ చైర్మన్ పట్టాభిరామ్ సమక్షంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డైరెక్టర్‌గా తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణ స్వీకారం చేసిన కల్పనారెడ్డిని మండల టీడీపీ అధ్యక్షులు నీలం మల్లికార్జునయాదవ్, కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బుజ్జమ్మ, సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొలుసు రత్నం, పలువురు టీడీపీ నాయకులు, తదితరులు అభినందించారు.

రాపూరులో టీడీపీ నేతల సంబరాలు



కేక్ కట్ చేస్తున్న చెన్నుతిరుపాల్‌రెడ్డి అభిమానులు

రాపూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ నాయకుడు చెన్నుతిరుపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు టీడీపీ నేతలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో టీడీపీ నాయకులు నల్లవడ్ల వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు మధురెడ్డి, చెన్ను పెంచలరెడ్డి, మందాటి చంద్రమోహన్, చానా, సికిందర్, జనసేన వీర మహిళా నాయకురాలు కొండాపురం కస్తూరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త నిరసన

సీతారామపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతా మని సచివాలయ సిబ్బంది పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఎం పీడీవో సాయి ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటి సర్వేల నుంచి విముక్తి కలిగించాలని, సమయ పాలనకు సంబంధించిన నిబంధనలు సడలిం చాలని, నోషనల్ ఇంక్రిమెంట్లతో పాటు ఆరేళ్లగా ఒకే క్యాడర్లో పనిచేసిన వారికి ప్రత్యేక ఇంక్రి మెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం కూడా విధులు నిర్వర్తించాలని ఒత్తిడి చేయడం తగదన్నారు.

నాలుగు డీఏలను విడుదల చేయాలి

- ఏపీటీఎఫ్ నాయకుల నిరసన



పొదలకూరు: నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

పొదలకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్ర జ్యోతి) : పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడు దల చేయాలని పొదలకూరు ఏపీటీఎఫ్ నాయకులు సుబ్బ య్య, శ్రీనివాసులు, మహమ్మద్ లు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి, డి ప్యూటీ తహసీల్దారు సురేఖకు విన తిపత్రం అందజేశారు. సీపీఎస్ రద్దు చేయాలని, మెమో నెం.57ను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి, ఐఆర్ ప్రకటించాలన్నారు. అన్నీ రకాల బకాయిలను చెల్లించాలన్నారు. ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలన్నారు. యాప్‌లు, అసె స్మెంట్ బుక్లెట్ విధానాలను రద్దు చేసి, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహ్మద్, రామకృష్ణ, అనిల్, మాల్యాద్రి, గోపీ, కాంతారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

- **వెంకటాచలం:** స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తహసీల్దారు శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఏపీటీఎఫ్ మండల నేతలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగులకు అన్నీ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నేతలు గుర్రం వెంకటేశ్వర్లు, నారాయణ, డీ శ్రీనివాసులు రెడ్డి, చేవూరు సుబ్బారావు, సురేష్, జనార్దన్ రెడ్డి, సుభాన్, నరసింహయ్య, చంద్రశేఖర్, నరసింహా రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

కొన్నట్లు నటిస్తూ.. నగలు కొట్టేస్తూ..

- దొంగతనం చేస్తూ పట్టుబడిన కి'లేడీ'లు



పట్టుబడ్డ మహిళలను విచారిస్తున్న పోలీసులు

ఉలవపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బంగారం షాపులో నగలు కొనుగోలు చేస్తున్నట్లు వ్యవహరించి, ఆభరణాలు దొంగిలిస్తూ పట్టుబడిన ఇద్దరు మహిళలపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అంకమ్మ తెలిపారు. కృష్ణాజిల్లా, ఇర్లపాడు మండలం గోకరాజుపల్లికి చెందిన ఇద్దరు మహిళలు శుక్రవారం ఉలవపాడు కృష్ణానగర్‌లోని సాల్‌జాన్ గోల్డ్‌షాపులో నగలు కొనుగోలు చేసేందుకు వచ్చారు. గత నెలలో ఈ ఇద్దరు మహిళలు ఇలాగే ఆభరణాలు కొనేందుకు వచ్చి రూ. లక్ష విలువ చేసే 4 జతల బంగారు కమ్మలు దొంగిలించుకువెళ్లారు. అనుమానం వచ్చిన షాపు యజమాని సీసీ ఫుటేజీల ద్వారా మహిళలను గుర్తించారు. గత నెలలో దొంగతనం చేసిన ఈ మహిళలు శుక్రవారం మరోసారి రాగా వెంటనే గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఇద్దరు మహిళలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. గోల్డ్‌షాపు గుమస్తా షేక్ సుల్తాన్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగతనానికి పాల్పడిన ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో అధికారులు వెల్లడించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏసీ దయాసాగర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సూపరింటెండెంట్ జగదీశ్వరరెడ్డి పర్యవేక్షణలో అధికారులు శుక్రవారం వెంకటేశ్వరపురంలో గంజాయి అక్రమ విక్రయాలపై దాడులు నిర్వహించారు. గంజాయి విక్రయిస్తున్న ఎస్‌డీ మౌలాలిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతనిని జిల్లా ప్రొహిబిషన్ కార్యాలయానికి తరలించి విచారించారు. అలాగే కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంకు చెందిన అరవ ఓమ్రేష్ గంజాయి విక్రయాలు చేసున్నట్లు గుర్తించి అతనిని అదుపులోకి తీసుకుని అతని వద్ద 2 కిలోల 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిరువురిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అనిత, సబ్‌ఇన్‌స్పెక్టర్ సీహెచ్ పూర్ణకుమార్, హెడ్‌కానిస్టేబుల్స్ ఏ.రమేష్‌కుమార్, ఎం.కిరణ్‌సింగ్, ఎన్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తండ్రి డబ్బులు లేవని చెప్పడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొదుతూ మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న పెంచల ప్రసాద్(21) ఐటీఐ వరకు చదువుకుని ఇంటివద్దే ఉంటున్నాడు. ఈనెల 7వ తేదీన ఆయన ఫ్రైండ్స్‌కు పార్టీ ఇచ్చేందుకు నగదు ఇవ్వాలని తండ్రి పెంచలయ్యను అడుగగా లేవని చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన పెంచల ప్రసాద్ అదే రోజు రాత్రి తన ఇంట్లో ఎలుకుల మందు తిని అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నారాయణ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు బాధిత తండ్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


రోడ్డు ప్రమాదంలో వీడియోగ్రాఫర్‌కు తీవ్ర గాయాలు



ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న కృష్ణ

కావలి రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం గౌరవరం ఫ్లైఓవర్ బ్రిడ్జి పై శుక్రవారం రాత్రి ముందు వెళ్తు న్న గుర్తుతెలియని లారీని వెనుక వైపు మోటారు బైక్ ఢీకొన్న ప్రమాదంలో వీడియోగ్రాఫర్ గంపాల కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాన్ని గుర్తించిన హైవే మొబైల్ సిబ్బంది క్షతగాత్రున్ని హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అతని వద్ద లభించిన ఆధారాల ప్రకారం బోగోలు మండలం ముంగమూరుకు చెందిన క్రిష్ణ వీడియోస్ నిర్వాహకుడు కృష్ణ కావలి నుండి ముంగమూరుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు రూరల్ ఎస్‌ఐ తిరుమల రెడ్డి గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చాడు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం క్రిష్ణను 108 వాహనంలో నెల్లూరుకు తరలించారు. ఎస్‌ఐ తిరుమల రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



దగ్ధమవుతున్న పూరిల్లు

కావలి రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన కావలి మండలం ఆనెమడుగు పంచాయతీ బైనేటివారిపాలెంలో గురువారం రాత్రి జరిగింది. అగ్నిమాపక శాఖ అధికారులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు... బైనేటివారిపాలెం గ్రామానికి చెందిన పరుసు వేణుకు చెందిన పూరింట్లో పరుసు రాఘవులు, రమ వారి నలుగురు కుమార్తెలతో ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించటంతో వారు గుర్తించి ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీసి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. వారు వచ్చేసరికి ఇల్లు పూర్తిగా దగ్ధం అయింది. ఈ ప్రమాదంలో వారి బట్టలు, సామగ్రి మొత్తం కాలి బూడిద కాగా సుమారు రూ.50వేల ఆస్తినష్టం వాటిల్లిందని, అధికారులు ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	141
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	274

కోడిగుడ్ల ధర (100): 550

చిన్నారులకు లివర్ వ్యాధిపై ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు(వైద్యం) సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న జిల్లా బాలభవిత కేంద్రంలో శుక్రవారం చిన్నపిల్లల్లో వచ్చే లివర్ వ్యాధులకు సంబంధించి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చెన్నై రెయిన్‌బో ఆసుపత్రి వైద్య నిపుణుడు డాక్టర్ సురేష్‌బాబు నిర్వహణలో ఏర్పాటైన ఈ వైద్య శిబిరంలో రెయిన్‌బో సీనియర్ వైద్యుడు డాక్టర్ సోమశేఖర్ పాల్గొని పలువురు చిన్నారులను పరీక్షించారు. పలు వైద్య సలహాలు, మందులు పంపిణీ చేశారు.


చిన్నారి వైద్య చికిత్సల రిపోర్టు పరిశీలిస్తున్న వైద్యుడు

సహకార సంఘాల్లో మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్లు

● కే.వెంకటేశ్వర్లు, నెల్లూరు డివిజన్ సహకారశాఖాధికారి



నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ఉత్పత్తులను మంచి ధర వచ్చినప్పుడు విక్రయించుకునేలా నిల్వ చేసుకునేందుకు గోదాములు ఎంతో అవసరం. కొన్ని చోట్ల ధాన్యం, మిరప, తదితరాలు నిల్వ చేసే గోదాములు లేవు. దీంతో పండిన పంటకు తగిన గిట్టుబాటు ధర లేకపోయినా తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో నెల్లూరు డివిజన్ పరిధిలోని సహకార సంఘాల్లో రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్లు (ఎంపీఎఫ్‌సీ) అందుబాటులోకి తెచ్చామని నెల్లూరు డివిజన్ సహకారశాఖాధికారి కందుల వెంకటేశ్వర్లు ఆంధ్రజ్యోతికి వివరించారు.

? డివిజన్‌లో ఎన్ని మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఉన్నాయి.

! టీపీ గూడూరు, చేజర్ల, కృష్ణపట్నం, గుండ్లపాళెం, కలివెలపాళెం, అనంతసాగరంలో మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఉన్నాయి.

? నెల్లూరు డివిజన్‌లో ఎన్ని సహకార సంఘాలు ఉన్నాయి? ఒక్కో సంఘంలో ఎంత మంది సభ్యులు ఉన్నారు? సభ్యుడు చనిపోతే ఏమిచేయాలి?

! నెల్లూరు డివిజన్‌లో 24 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా అందులో రెండు సీడెడ్ సొసైటీలు ఉన్నాయి. ఒక్కో సంఘంలో 2 వేల నుంచి 10వేల మంది సభ్యులు ఉంటారు. సహకార సంఘంలో సభ్యుడు చనిపోతే నామినీని సభ్యుడిగా చేయవచ్చు. 20 సొసైటీల్లో కంప్యూటరైజేషన్ ప్రక్రియ పూర్తయింది. రెండింటిలో పూర్తి కావాల్సి ఉంది. సహకార సంఘాల డిజిటలైజేషన్‌తో పారదర్శకత ఏర్పడుతోంది. ఖాతాదారు ఎప్పుడైన తన ఖాతాలోని నగదు, రుణ వివరాలు తెలుసుకోవచ్చు.

ఈ ఇంటర్వ్యూ

? సహకార సంఘంలో సభ్యుడిగా చేరాలంటే ఏమి చేయాలి.

! సహకార సంఘంలో సభ్యుడిగా చేరాలంటే సంబంధిత గ్రామంలో హేమి ఉండాలి. రూ.300 షేర్ క్యాపిటల్, రూ.30 ప్రవేశ రుసుం కట్టాలి. సభ్యుడిగా చేరిన తరువాత సహకార సంఘంలో ఒక ఏడాది పాటు ఎరువులు, తదితరాలు కొనుగోలు చేస్తూ, సహకార సంఘంలో నగదు లావాదేవీలు నిర్వహించాలి.

? జాతీయ బ్యాంకులతో సమానంగా సేవలు అందుతాయా.

! సహకార సంఘాల ద్వారా జాతీయ బ్యాంకులతో సమానమైన సేవలు అందించడానికి డిజిటలైజేషన్ దోహదపడుతుంది. సాంకేతికతను ఉపయోగించటం ద్వారా పీఏసీఎస్‌లను సమర్థవంతంగా నిర్వహించవచ్చు.

? పీఏసీఎస్‌లు ఆన్‌లైన్ కార్యకలాపాలు నిర్వహించడానికి వీలవుతుందా.

! డిజిటలైజేషన్ ప్రక్రియతో రాష్ట్ర సహకార బ్యాంకులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా పీఏసీఎస్‌లను నాబార్డుతో అనుసంధానిస్తారు. దీంతో పీఏసీఎస్‌లు ఆన్‌లైన్‌లో కార్యకలాపాలు నిర్వహించడానికి, నాబార్డు నుంచి రుణాలు పొందేందుకు సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తారు.

? సహకార సంఘాల్లో రుణాల మంజూరు ఎలా ఉంటుంది.

! సహకార సంఘాల్లో రుణాలను సులభంగా పొందవచ్చు. రైతుల పట్టదారు పాస్‌బుక్‌లు పరిశీలించి రుణాలను ఎప్పటికప్పుడు మంజూరు చేస్తారు. రుణ మంజూరు, మోసాలు తదితర అంశాలకు సంబంధించి డిస్ట్రిక్ట్ లెవల్ ఇంప్లిమెంటేషన్ కమిటీ చర్యలు తీసుకుంటుంది.

ఆదమరిస్తే ఆసుపత్రికే!



ఈ ఫొటోలో కనిపిస్తున్న ప్రాంతం అల్లీపురం వద్ద జాఫర్‌సాహెబ్ కాలువపై నిర్మించిన వంతెన, రెగ్యులేటర్. వంతెన నిర్మాణం శిథిలావస్థకు చేరడంతో ఇటీవల దానిపై రక్షణ గోడ పడిపోయింది. దీంతో వాహనదారులు, నడిచి వెళ్లేవారికి నిత్యం ప్రమాదం పొంచి ఉంది. ఈ వంతెనపై టిడ్కో గృహాలకు వెళ్లే లబ్ధిదారుల తాకిడి ఎక్కువగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పైగా ఈ వంతెన ఆధారంగా నవలాకులతోట, నారాయణరెడ్డిపేట, కోడూరుపాడు ప్రాంతాలకు వెళ్లే దారి ఉండటంతో అటుగానూ కొందరు ప్రయాణిస్తుంటారు. ఆదమరిస్తే ఇక్కడ ప్రమాదఘటికలు ఉన్నాయి. ఈ క్రమంలో శిథిలావస్థకు చేరిన ఈ వంతెన ఎక్కడ కూలుతుందో, ఎలాంటి ప్రమాదం సభవిస్తుందోనని స్థానికులు, వాహన చోదులకు భయాందోళన చెందుతున్నారు.

- నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి)

వరసిద్ధి వినాయకుడి ఆలయ కుంభాభిషేకం


ఆలయ శిఖరంపై పూజలు చేస్తున్న అర్చకుడు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని ట్రంకురోడ్డు శివాజీ సెంటర్‌లో వేంచేసియున్న వరిసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షిక కుంభాభిషేకం శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. తొలుత స్వామివారికి పంచామృతాభిషేకాలు, గణపతి హోమం, రుద్రహోమం, మహాపూర్ణాహుతి, సహస్ర నామార్చనలు జరిగాయి. తదుపరి కలిశాలను మహాహారతి పూజలు నిర్వహించి వరసిద్ధి వినాయకస్వామికి ఆలయ శిఖరంపై ప్రోక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆలయ నిర్వాహకులు కేవీ సుబ్రహ్మణ్యం, బీఎస్ రంగరాజన్, అలిమెలి శ్రీహరి, పేటేటి భాస్కర్ రావు, బాలసుబ్రహ్మణ్యం, మధుసూదన్ పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు సతీష్ శర్మ ఘనంగా నిర్వహించారు. తదుపరి శివాజీసెంటర్ మిత్రమండలి భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు.

రాజరాజేశ్వరి ఆలయంలో 22 నుంచి

దేవీ శరన్నవరాత్రులు

● గోడపత్రిక ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దేవీనవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ కల్యాణ మండపంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డితో కలిసి సమన్వయంతో పనిచేసి చిన్నపొరబాటు లేకుండా ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ నాయకులు, అధికారులు తమ హోదాలను బయటే వదిలివేసి అమ్మవారి భక్తులకు సేవ చేయాలన్నారు. తానూ సామాన్యుడిగానే అమ్మవారిని దర్శించుకుంటున్నానన్నారు. ఎమ్మెల్యే పేరు చెప్పి కార్పొరేటర్లు, ఆలయ ట్రస్టీలు, ఇతర వ్యక్తులు ఎలాంటి పైరవీలు చేయరని హామీ ఇచ్చారు. వలంటీర్ల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వలంటీర్ల చర్యల వలన హక్తుల భావాలు దెబ్బతినకూడదని హెచ్చరించారు. ఆలయ ట్రస్టీలు, జర్నలిస్టులు, వలంటీర్లతోపాటు దాతలకు, వారి కుటుంబ సభ్యులకు ఐడీ కార్డులు ఇవ్వాలని, పాసులు ముద్రించవద్దని ఆదేశించారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు వీఐపీలకు శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక దర్శన సమయాలు కేటాయిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం మహిళా భక్తులు అంతరాలయంలో ప్రదక్షిణలకు అర్ధరాత్రి 1.30 నుంచి తెల్లవారుజామున 3.30గంటల వరకు సమయం కేటాయించామని తెలిపారు.


దేవీనవరాత్రి ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, తదితరులు

● **10 మందితో ఉత్సవ కమిటీ**

రాజరాజేశ్వరి ఆలయంలో జరిగే దేవీ నవరాత్రి ఉత్సవాలకు 10 మందితో తాత్కాలిక కమిటీగా ఏర్పాటు చేసిన ఏలూరు శిరీషా, గజరా నరేష్, దావులూరి జమున, గూడంశెట్టి దొరబాబు, మానికల నాగమని, బిరదవోలు చంటిబోపన తేజ, రావూరు రాధాకుమారి, నాటకరాణి, చిన్నపెంచలయ్య, కల్లూరు వీరరాఘవేంద్ర, ఎక్స్‌అఫిషియో సభ్యుడుగా ప్రధాన అర్చకులు రఘురామమూర్తులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనూష, నగర డీఎస్పీ సింధుప్రియ, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రాజరాజేశ్వరి సేవా సమితి అధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి, రాజానాయుడు, మాజీ మేయర్ భానుశ్రీ, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు, తదితరులు పాల్గొన్నారు.

కేరళలో ఎన్‌ఎంసీ కమిషనర్ నందన్



సమావేశంలో కమిషనర్ నందన్

నెల్లూరు (సిటీ), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కేరళ అర్బన్ కాంక్లేవ్ సమావేశానికి ఎన్‌ఎంసీ కమిషనర్ నందన్ హాజరయ్యారు. శుక్రవారం ఆ సమావేశంలో పాల్గొన్న ఆయన ఆకాంక్షించే నగరాలు, అభివృద్ధి చెందే సమాజాలు అనే అంశంపై ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఇక్కడ చర్చించే పలు విషయాలు నెల్లూరు సిటీ అభివృద్ధికి ఎంతగానో దోహదపడు తాయని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని శెట్టిగుంటరోడ్డు, వెంకటేశ్వరపురం, రైతుబజార్, రామూర్తినగర్, గోమతినగర్, ఎంజీనగర్, పడారుపల్లి, వైఎంసీఏ, రాజేంద్రనగర్, రంగనాయకులపేట, డీఆర్‌డీఏ సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్ల మరమ్మతులు చేస్తున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం.శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆటో డ్రైవర్లకు పండుగ

● టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ● చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వాహన మిత్ర పథకాన్ని ప్రవేశ పెట్టి రాష్ట్రంలో ఆటో డ్రైవర్లకు పండుగ వాతావరణం నెలకొల్పారని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డిలు పేర్కొన్నారు. నగరంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజి ఆధ్వర్యంలో శుక్రవారం ఆటో డ్రైవర్‌లతో కలిసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఫ్రీ బస్సు వచ్చాక ఆటో డ్రైవర్లపై కొంత ప్రభావం పడిందని భావించిన చంద్రబాబు వాహన మిత్రను ప్రకటించారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ.10 వేలు ఇచ్చి 20వేలు అపరాధ రుసుం పేరుతో వసూలు చేశారన్నారు. కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ సూపర్‌సిక్స్‌లో లేని ఎన్నో పథకాలు సైతం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. ఆయన తన అనుభవంతో రాష్ట్రానికి ఆదాయాన్ని ఎలా పెంచాలి, ప్రజలకు ఎలా మేలు చేయాలి అన్న విధానంపై ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వంలో డ్రైవర్లు స్వేచ్ఛగా ఆటోలు నడిపేవారన్నారు. టీడీపీని నమ్మి ఆటో డ్రైవర్లు పార్టీలో చేరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు, నేతలు మొయిద్దీన్, ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు వెంగయ్య ప్రసన్నకుమార్, హబీబ్, చంద్రశేఖర్, నాగూర్, విల్సన్ పాల్గొన్నారు.


చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు అజీజ్, కోటంరెడ్డి తదితరులు

భక్తిశ్రద్ధలతో సామూహిక రాహుకాల పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజరాజేశ్వరి ఆలయం శుక్రవారం మహిళ భక్తులతో కిటకిటలాడింది. ఛండీహోమం, నవావరణ పూజలు, సుందరేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. అనంతరం పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు రాహుకాల పూజలు చేశారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి అమ్మవారికి అలివెట్టి మండపంలో విశేష అలంకారం జరిగింది. అనంతరం సామూహిక రాహుకాల ఉద్యాపన పూజలు ఆలయ అర్చకులు భక్తుల చేత భక్తిశ్రద్ధలతో చేయించారు. భక్తులకు భారీ అన్నప్రసాద వితరణలు జరిగాయి. రాత్రి అమ్మవారికి కుంభహారతులు, పల్లకీసేవ కన్నుల పండువగా జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.


రాజరాజేశ్వరి ఆలయంలో సామూహిక రాహుకాల పూజల్లో పాల్గొన్న భక్తులు

ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించాలి

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రథమ చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించాలని మదాల స్పెషాలిటీ వ్యవస్థాపకుడు డాక్టర్ మదాల వెంకట్ తరుణ్ అన్నారు. శుక్రవారం బుజబుజనెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెట్నల్, పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నెహ్రూ యువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాదాల, సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు మాట్లాడారు. అనంతరం పాఠశాలకు ఫస్ట్ ఎయిడ్ బాక్సును అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి, నెహ్రూ యువకేంద్రం అధికారి మహేందర్‌రెడ్డి, సెట్నల్ మేనేజర్ శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్ని రమణయ్య, పీహెచ్‌పీ జిల్లా నేతలు జయప్రకాష్, శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీవో అనూష, ఐసీడీఎస్ పీడీ హేన సుజన్, తదితరులు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 4 వర్కర్, 66 హెల్పర్స్ పోస్టులకు 147 మంది అభ్యర్థులు హాజరయ్యారు. దీంతో ఆర్డీవో కార్యాలయ ప్రాంగణం సందడి వాతావరణం నెలకొంది. నెల్లూరు ఆర్డీవో అనూష, ఐసీడీఎస్ పీడీ హేన సుజన్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నెల్లూరు అర్బన్, రూరల్, సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాలతో రాపూరులతో కలపి 11 మండలాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖకు చెందిన బ్రహ్మేష్‌నాయుడు, ఆర్డీవో కార్యాలయ ఏవో నిర్మలానందబాబా, పలువురు ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో అట్టహాసంగా హిందీ దివస్

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకేడబ్ల్యూ ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఒడిశా సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ.శ్రీకాంత్‌లక్ష్మణ్‌రావు పాల్గొని మాట్లాడారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలకు హిందీభాషా వారధిలాంటిదన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో దేశ ప్రజలందరినీ ఏకతాటిపై నడిపించడంలో హిందీ భాష కీలకభూమిక పోషించిందన్నారు. ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన మోటూరి సత్యనారాయణ మాతృభాష తెలుగు అయినప్పటికీ హిందీ భాషాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. దక్షిణభారత హిందీ ప్రచార సభ, కేంద్రీయ హిందీ సంస్థాన్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల స్థాపనలో ఆయన పాత్ర ఎంతో కీలకమైందని తెలిపారు. కళాశాల హిందీ శాఖాధ్యక్షుడు డాక్టర్ ఎస్. సురేంద్ర మాట్లాడుతూ హిందీని 250 మిలియన్ల ప్రజలు తమ ప్రథమభాషగా మాట్లాడుతున్నారన్నారు. అనంతరం కళాశాల విద్యార్థిని జీ.భానుశ్రీ రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.గిరి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో

● నగరంలోని నవాబుపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హిందీభాషా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో హమీద్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం బాలబ్రహ్మాచారి, హిందీ ఉపాధ్యాయిని మంజుల, నాగేశ్వరమ్మ, ఉపాధ్యాయులు ఎంసీ.అచ్చయ్య, కమల, తిరుపాల్‌రాజు, ఖాదర్‌బాషా, జాఫర్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ కోసం ఏచూరి నిత్యపోరాటం

● ప్రథమ వర్ధంతి సభలో సీపీఎం శ్రేణులు


ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరురూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగాన్ని కాపాడేందుకు సీతారాం ఏచూరి నిత్యం పోరాటం చేస్తునే ఉండేవారని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఆయన ప్రథమ వర్ధంతిని పురష్కరించుకుని శుక్రవారం సౌత్‌మోపూరులోని ఆ పార్టీ కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు చంద్రరాజగోపాల్, చంద్రమౌళిలు మాట్లాడారు. కట్టుబడిన సిద్ధాంతాల కోసం ఎంతటి పోరాటానైనా ఎదుర్కొన్న వ్యక్తి ఏచూరని కొనియాడారు. నేటి తరం యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్, నాయకులు ఆలూరు తిరుపాలు, ముత్యాల నాగయ్య, జానా లక్ష్మీప్రసాద్, ప్రభాకర్, అనిల్, పాదర్తి మస్తాన్ పాల్గొన్నారు.

వసూళ్లపై దృష్టి పెట్టాలి

(5వ పేజీ తరువాయి)

లేక నిలిచిపోయిందని పేర్కొన్నారు. చివరకు సిబ్బందికి జీతభత్యాలు కూడా చెల్లించలేని స్థితిలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్రాంత ఉద్యోగులమైన తమకు పింఛన్లు కూడా అందడం లేదని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పన్ను బకాయిలు వసూలు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

● జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ


కాలువను పరిశీలిస్తున్న మలేరియా అధికారి హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమ పరిసరాలలో దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ సూచించారు. శుక్రవారం యాకో నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలోని ఆకుతోటలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. అలాగే 48వ డివిజన్ రామాలయం పరిసరాలను పరిశీలించి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాల ని స్థానికులకు తెలియచేశారు. ఈ సందర్భంగా హుస్సేనమ్మ మాట్లాడుతూ ప్రతి ఆశా కార్యకర్త ప్రతిరోజూ 6 ఇళ్లను పరిశీలించి ఆయా ప్రాంతాలలో లార్వా సర్వే చేపట్టాలన్నారు. రాష్ట్ర స్థాయి వైద్యాధికారులు వచ్చినప్పుడు లార్వాలు దొరకకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి బుధవారం, శనివారం రక్తపూతలు తీసి ల్యాబ్‌కు పంపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుజిత, రుబీన, సిబ్బంది పాల్గొన్నారు.

2029 నాటికి సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యం

● డిప్యూటీ డైరెక్టర్ మాధురి



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న డీడీ మాధురి

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో నిరక్షరాస్యులను 2029 నాటికి అక్షరాస్యులుగా తీర్చిద్దిడమే లక్ష్యమని అమృత పథకం డిప్యూటీ డైరెక్టర్ మాధురి స్పష్టం చేశారు. ఉల్లాస్ లో భాగంగా శుక్రవారం మెప్మా సిబ్బందితో ఎన్‌ఎంసీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరక్షరాస్యులను క్షేత్రస్థాయిలో ఎంపిక చేయాలన్నారు. ఎక్కడ ఎలాంటి లోపం ఉండకూడదని తెలిపారు. అక్షర ఆంధ్ర ఏర్పాటుకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రతీ ఒక్కరు తమవంతు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నిరక్షరాస్యులందరికీ వయోజన విద్య అందించడం వల్ల నూరుశాతం అక్షరాస్యత సాధ్యమవుతుందని చెప్పారు. పీ4లో మార్గదర్శులుగా ఎంపికైన వారి నుంచి బోధన అందించే వ్యవస్థను రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి మస్తాన్‌రెడ్డి, సిటీ ఎంఈవో తిరుపాల్, మెప్మా ఏవో సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమి ఆక్రమణ

● తాటిచెట్లు తొలగించి చదును

అనంతసాగరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిగుంట వద్ద గంగమ్మ ఆలయ సమీపంలో కేతమన్నేరువాగు పోరంబోకు స్థలాన్ని కొందరు ఆక్రమించారు. సుమారు రెండు ఎకరాల భూమిలో ఉన్న తాటి చెట్లు తొలగించి చదును చేశారు. భూమి ఆక్రమిస్తే భవిష్యత్తులో పశువుల మేతకు ఇబ్బంది రావడంతో పాటు తాటి చెట్ల వల్ల జీవనం సాగిస్తున్న కల్లుగీత కార్మికులకు జీవనోపాధి లేకుండా పోతుందని, వాగుభూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

యూరియా వచ్చిందోచ్..!

బండగానిపల్లి రైతుసేవా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా 18 టన్నుల ఎరువు

ఉదయగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి రైతుసేవా కేంద్రానికి 18 టన్నుల యూరియా వచ్చినట్లు ఉదయగిరి సబ్ డివిజన్ ఇన్‌చార్జి వ్యవసాయ సంచాలకులు పీ చెన్నారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఉదయగిరి రైతు సేవా కేంద్రం-2కి 18 టన్నుల యూరియా రాగా రైతులందరికీ అందలేదు. దీంతో రైతుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. వారు స్పందించి మరో 18 టన్నుల యూరియా పంపించారన్నారు. త్వరలో మరో 18 టన్నుల యూరియా తిరుమలాపురం రైతుసేవా కేంద్రానికి వస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సోమవారం నుంచి మండలంలోని బండగానిపల్లి, జీ.చెరువుపల్లి రైతుసేవా కేంద్రాల పరిధిలో పంటల సాగు చేసిన రైతులకు ఈ యూరియా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గడ్డిజొన్న, జామాయిల్ సాగు రైతులకు యూరియా పంపిణీ చేయరన్నారు. కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



బండగానిపల్లి రైతు సేవా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న యూరియా బస్తాలు



డేంజర్ జోన్‌లో చేపల వేట

అనంతసాగరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం వద్ద కండలేరుకు నీరు సరఫరా చేసే వరద కాలువ వద్ద కొందరు ప్రమాదమని తెలిసినా చేపలవేట సాగిస్తున్నారు. అనుమతి లేకుండా నిషేధిత ప్రాంతాల్లో ప్రజలు సంచరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వరద కాలువ అంచున నిలబడి చేపలు పడుతూ గతంలో కొందరు కాలువలో పడి మృత్యువాత పడ్డ ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా ఇంజనీర్లు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బతికించే తొలి వైద్యం

అత్యవసర సమయంలో ప్రాణాలు నిలబెట్టేది ప్రాథమిక వైద్యం. ఏదైనా ప్రమాదం, విపత్తు సంభవించినప్పుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి తక్షణం అందించే చికిత్స వారిని రక్షిస్తుంది. ఇందుకు వైద్యులు, వైద్య సిబ్బందే అయి ఉండాల్సిన అవసరం లేదు. కనీస అవగాహన కలిగిన వారు ఎవరైనా... ఆసుపత్రికి చేరేలోపు బాధితుల పరిస్థితి మరింత క్షీణించకుండా ఫస్ట్ ఎయిడ్‌తో ప్రాణాలు నిలబెట్టవచ్చు. ప్రస్తుత సమాజంలో ప్రమాదాలు నానాటికీ పెరిగిపోతున్న తరుణంలో ప్రతీ ఒక్కరు ప్రాథమిక వైద్యం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఇది వారితోపాటు తోటి వారిని కూడా రక్షించేందుకు తోడ్పడుతుంది.

● ప్రథమ చికిత్సకు ఎంతో ప్రాధాన్యత ● ఎందరివో ప్రాణాలను నిలబెట్టిన సందర్భాలు

● ఏటా వెయ్యి మందికి రెడ్‌క్రాస్ శిక్షణ ● పరిశ్రమల సిబ్బందికి తర్ఫీదు ఎక్కడ..?

● నేడు ప్రపంచ ఫస్ట్ ఎయిడ్ డే

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైద్య శాస్త్రంలో ప్రాథమిక వైద్యానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇలాంటి వైద్య చికిత్సల వల్ల జిల్లాలో ఎందరో ప్రాణాలను కాపాడిన సంఘటనలు ఉన్నాయి. జిల్లాలో ఏటా మూడు వేలకుపైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిలో గాయపడ్డవారికి స్థానికులు, 108 అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక వైద్యం అందించి ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఆ తర్వాత వైద్య నిపుణులు చికిత్సలు అందిస్తుంటారు. అలాగే గర్భవతులకు అత్యవసరమైన స్థితిలో ప్రాథమిక వైద్యం ఎంతో ఉపయోగపడుతుంది. జిల్లాలో వెయ్యి మంది వరకు గ్రామీణ వైద్యులు ప్రాథమిక వైద్యాన్ని అందిస్తున్నారు. ప్రధానంగా గుండె వ్యాధి కారణంగా శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే ప్రాథమిక వైద్యంగా కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) చేయాల్సి ఉంటుంది. ప్రపంచ ఫస్ట్ ఎయిడ్ డే సందర్భంగా ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ, డిజిటల్ ప్రపంచంలో ప్రథమ చికిత్స అన్న నినాదాన్నిచ్చింది. సెల్‌ఫోన్ ద్వారా ప్రాథమిక చికిత్స విధానాలు తెలుసుకుని తక్షణ వైద్యం అందించాలని పిలుపునిచ్చింది.



ప్రాథమిక చికిత్స చేస్తున్న అంబులెన్స్ సిబ్బంది (ఫైల్)

పరిశ్రమల సిబ్బందికి శిక్షణ ఏది?

జిల్లా వ్యాప్తంగా వందల పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో వేలాది మంది పనిచేస్తున్నారు. ఆయా పరిశ్రమల్లో ఉద్యోగంలో చేరాలంటే ప్రాథమిక వైద్యం సర్టిఫికెట్ తప్పనిసరి. కేవలం 15 రోజులు ప్రాథమిక వైద్యంపై శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇస్తారు. ఇలాంటి చికిత్స అందించడంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ముందంజలో ఉంది. ఇక్కడ ఏటా 1000 మందికి ఢిల్లీకి చెందిన సెయింట్ జాన్ అంబులెన్స్ అసోసియే షన్ ప్రాథమిక వైద్యంపై శిక్షణ ఇస్తోంది. అలాగే, గ్రామీణ వైద్యులకు నూతన వైద్య విధానాలపై శిక్షణ ఇస్తున్నారు. అయితే ఉద్యోగ నియామకాల్లో చాలా వరకు నకిలీ ప్రాథమిక సర్టిఫికెట్లు సమర్పిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి సర్టిఫికెట్లతో ఉద్యోగంలో చేరిన వారు పరిశ్రమలో ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు ఫస్ట్ ఎయిడ్ చేసే అవకాశాలు చాలా తక్కువ. దీనివల్ల ప్రాణనష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం, యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది.

ప్రాణాలు కాపాడొచ్చు



ప్రాథమిక వైద్యం అందించిన తర్వాత రోగిని ఆసుపత్రికి తీసుకువస్తే వైద్య నిపుణులు అత్యుత్తమ చికిత్స అందించవచ్చు. జిల్లాలో ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. అలాంటి వారికి అంబులెన్స్ వచ్చేలోపు రక్తం పోకుండా గాయాలకు కట్టుగట్టి చికిత్స చేయాలి. గుండెకు వ్యాధులకు తక్షణం సీపీఆర్ చేస్తే వ్యాధిగ్రస్తులను ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చు.

- కృష్ణమూర్తి, జీజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్

గ్రామీణ వైద్యుల ప్రాథమిక చికిత్సలు



జిల్లా వ్యాప్తంగా గ్రామీణ వైద్యులు ప్రాథమిక వైద్యాన్ని అందిస్తున్నారు. రెడ్‌క్రాస్‌లో కూడా శిక్షణ తీసుకున్నారు ప్రభుత్వ వైద్య పథకాలపై ప్రచారం చేస్తున్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణం వైద్యం అందిస్తున్నారు.

- వేణుగోపాల్, సీహెచ్‌సీ, జిల్లా అధ్యక్షుడు



ప్రాథమిక చికిత్సలు ఇలా..

- పాము కాటుకు గురైనప్పుడు కాటు వేసిఇన భాగాన్ని కదలకుండా ఉంచాలి. బిగుతుగా ఉన్న దుస్తులు, నగలు తీసివేయాలి. వెంటనే వైద్యుని వద్దకు తరలించి చికిత్స అందించాలి.
- గాయపడ్డవారికి గాయాలను శుభ్రపరిచి రక్తం ఎక్కువ పోకుండా గుడ్డతో కట్టు కట్టాలి.
- విషం తాగితే తక్షణం ఆ విషాన్ని కక్కించే ప్రయత్నం చేయాలి.
- అలసటతో ఉన్న వారిని చల్లటి ప్రదేశానికి తరలించాలి. తడి గుడ్డలను శరీరానికి చుట్టి చర్మానికి చల్లదనం ఉండేలా చూడాలి. చలి జ్వరం ఉన్న వారిని దుప్పట్లతో చుట్టాలి.
- మూర్ఛ పోయిన రోగిని తక్షణం తిప్పి పడుకోబెట్టాలి, గాలి బాగా అందేలా చూడాలి. కొద్దిగా కోలుకోగానే వైద్యుడ్ని సంప్రదించాలి.
- డీహైడ్రేషన్‌కు గురైన వారికి వెంటనే నీరు తాగించాలి, చల్లని ప్రదేశానికి తరలించాలి. లో షుగర్‌తో ఉన్న వారికి తీపి పదార్థం ఇవ్వాలి,
- గుండె వ్యాధి వల్ల ఊపిరితీసుకోవటంలో ఇబ్బందులు ఎదురయితే వెంటనే సీపీఆర్ చేయాలి. ఆస్తమా వ్యాధిగ్రస్తులకు ఇన్‌హేలర్‌ను వినియోగించాలి.
- కాలిన గాయాలకు బర్న్ క్రీమ్ రాయాలి. ప్రాథమిక వైద్యానికి అవసరమైన వస్తువులు అందుబాటులో ఉంచుకోవాలి.

పీఆర్ ఇంజనీర్లకు
నేడు ఆటల పోటీలు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఏపీ పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం, డిప్లొమో ఇంజనీర్ల సంఘం సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ ఎం.బాబురావు, కార్యదర్శి ఎస్‌కే.ఖాదర్‌మస్తాన్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పంచాయితీరాజ్ శాఖలో అన్ని స్థాయిల ఇంజనీర్లు, ఇతర ఉద్యోగులకు క్రికెట్, షటిల్, వాలీబాల్, క్యారమ్స్, చెస్, రింగ్‌బాల్, పరుగు పందెం పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. విజేతలకు ఈనెల 15వ తేదీన జడ్పీ కార్యాలయ నూతన సమావేశ మందిరంలో జరిగే ఇంజనీర్స్‌డే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ శనివారం ఉదయం 8 గంటలకు స్టేడియంలో హాజరు కావాలని తెలిపారు.

సచివాలయాలపై నిఘా

● ప్రత్యేకాధికారులతో పర్యవేక్షణ

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల్లో ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వాటిపై నిరంతర నిఘా ఉంచుతూ ప్రత్యేకాధికారుల ద్వారా పర్యవేక్షించేందుకు అడుగులు వేస్తోంది. ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో జిల్లావ్యాప్తంగా 769 గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారు. అయితే, పర్యవేక్షణ లేనికారణంగా ఆశించిన సేవలు అందడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాంటి సచివాలయాల్లో నెలకొన్న లోపాలను సరిదిద్దడంతోపాటు ఉద్యోగులను గాడిన పెట్టేందుకు డీఎల్‌డీవో స్థాయి ప్రత్యేక అధికారిని కలెక్టరేట్ పరిధిలో నియమించనున్నారు. అంతేగాక ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న జిల్లా కార్యాలయం నుంచి ఆయన పర్యవేక్షించనున్నారు. మండల స్థాయిలోనూ ఏవో హోదా కలిగిన అధికారిని నియమించనున్నారు. అతిత్వరలో అధికారులతోపాటు సిబ్బంది సైతం నియమించే అవకాశాలు ఉన్నాయి. ఈమేరకు జీవో నెం.10 విడుదల చేస్తూ జిల్లా ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.

● ఏపీ బీసీ సంక్షేమ సంఘం ర్యాలీ

ఎన్నికల హామీలు అమలు చేయాలి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నాయకులు 2024 సాధారణ ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పనమాల శ్రీహరిరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం బీసీ కులాల ప్రజలు, నాయకులు నెల్లూరు నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని డీఆర్వో విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడిన బీసీలకు, ఎస్సీ, ఎస్టీల మాదిరిగా ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని కూటమి పార్టీల నాయకులు వాగ్దానం చేశారని, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో నామినేటెడ్ పదవులు, నామినేషన్ పనుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. మూడు నెలల ముందే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల కమిషన్ ప్రకటించిందని, కులగణన సమగ్రంగా నిర్వహించకుండా రిజర్వేషన్లు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ముందు కులగణన చేపట్టాలన్నా రు. బీసీల జనాభా ప్రకారం సబ్‌ప్లాన్ రూపొందించి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. రాజధాని అమరావతిలో పూలే స్మృతి వనం నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి ముంగర శైలజ, రాష్ట్ర మహిళా నాయకురాలు పద్మజ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కే సలీం, రాముగౌడ్, కోవూరు నియోజవర్గ ఇన్‌చార్జి పెంచలయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వో విజయకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీహరిరావు, పద్మజ తదితరులు

ప్యాకేజీ-1పై
విచారణ ముమ్మరం

● అనేక అవకతవకలను గుర్తించిన విజిలెన్స్ అధికారులు
● ఫైనల్ బిల్లు సమయంలోనే జరిగినట్లు నిర్ధారణ
● అప్పట్లో పనిచేసిన అధికారుల వివరాలు ఇవ్వాలని లేఖ
● వారందరినీ బాధ్యులను చేసేందుకు సిద్ధం
● త్వరలో ప్రభుత్వానికి చేరనున్న నివేదిక
● ఎట్టకేలకు కౌంటర్ వేసిన ఇరిగేషన్ శాఖ

నెల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెన్నా డెల్టా సిస్టమ్‌ను ఆధునికీకరించేందుకు 2008-09లో రూ.308 కోట్ల అంచనాలతో ప్యాకేజీ-1 పేరుతో టెండర్లు పిలిచారు. మోడరనైజేషన్ చేయడమే కాకుండా 124 డిస్ట్రిబ్యూటరీ కాలువలకు సీసీ లైనింగ్ ఏర్పాటు చేయాలన్నది ఉద్దేశం. ఈ వర్కును అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత ఓ వైసీపీ కీలక నేత 4.95 శాతం ఎక్సెస్‌కు దక్కించుకున్నారు. అయితే ఈ వర్కు అనుకున్న విధంగా పూర్తి కాలేదు. అనేక సార్లు రివైజ్ చేయించుకున్నారు. నిబంధనల ప్రకారం పనులు జరగలేదని, కాలువల లైనింగ్ వెడల్పులను తగ్గించి పనులు చేశారని గతంలోనే అధికారులకు ఫిర్యాదులు అందాయి. అయితే నాడు ఎవరూ పట్టించుకోలేదు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్యాకేజీ-1 వర్కును ప్రీక్లోజ్ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. 2020, జులైలో ప్రీక్లోజ్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ప్రీక్లోజ్‌లో భాగంగా అప్పటి వరకూ కాంట్రాక్టర్ చేసిన పనులన్నింటికీ ఎంబుక్ రికార్డింగ్ చేసి, వాటికి చెక్ మెజర్మెంట్ చేశారు. ఫైనల్ బిల్లు మొత్తం రూ.67 కోట్లు చెల్లించాలని తేల్చారు. ఈ మేరకు చేసిన పనులను పరిశీలించి క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ జారీ చేయాలని నెల్లూరు సెంట్రల్ డివిజన్ ఈఈ నుంచి 2021, ఫిబ్రవరిలో క్వాలిటీ కంట్రోల్ ఈఈకు లేఖ వెళ్లింది. ఈ రిక్విజిషన్ ప్రకారం మొదట క్యూసీ అధికారులు సర్టిఫికెట్లు జారీ చేశారు. ఇందులో ఒక సర్టిఫికెట్లో దిద్దుబాటు చేసి రూ.4.12 కోట్లను అదనం చేర్చారు. ఇదే పేరుతో మరో రూ.4.40 కోట్లతో మరో సర్టిఫికెట్‌ను జారీ చేశారు. ఇక ప్రభుత్వం ప్రీక్లోజ్ చేశాక సీఈ అంచనాలు రివైజ్ చేయడం కూడా మరో వివాదంగా ఉంది. ఇక ఇందులో బ్యాంక్ కమీషన్ చార్జీలకు రూ.50 లక్షలకు అనుమతి ఇవ్వగా బిల్లులో మాత్రం దాదాపు రూ.2 కోట్లకుపైగా పెట్టినట్లు ఫిర్యాదులున్నాయి. అలానే ఈపీసీ విధానంలో క్యూసీ చార్జీలను కాంట్రాక్టరే భరించాల్సి ఉండగా, ఆ మొత్తాన్ని కూడా బిల్లుల్లో చేర్చారన్న ఆరోపణలున్నాయి. ఇలా ఒక లెక్కా పక్కా లేకుండా వివాదాలకు తావిచ్చేలా ప్యాకేజీ-1 ప్రీక్లోజ్ ప్రక్రియ జరిగింది.

'ఆంధ్రజ్యోతి' కథనాలతో కదలిక

గతేడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో హడావిడిగా ఈ బిల్లును సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. అప్‌లోడ్ చేయడమే తడవుగా ఈ బిల్లులు పరుగులు పెట్టింది. అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో డబ్బులు విడుదల కాలేదు. ఇక ప్రభుత్వం మారగానే ఇరిగేషన్ అధికారులు సాంకేతిక కారణాల పేరుతో ప్యాకేజీ-1 బిల్లును సీఎఫ్ఎంఎస్ నుంచి వెనక్కు తెచ్చారు. ఆ తర్వాత ఎటువంటి తదుపరి చర్యలు లేకుండా మిన్నకుండిపోగా కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించారు. ఆ క్రమంలో ప్యాకేజీ-1లో జరిగిన అవకతవకలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో వరుస కథనాలు ప్రచురించింది. ఈ కథనాలపై స్పందించిన కలెక్టర్ ఆనంద్.. ప్యాకేజీ-1 వర్కుపై నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అయినా కలెక్టర్‌కు నివేదిక అందలేదు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ప్యాకేజీ-1 వర్కుపై వస్తున్న ఆరోపణలను నిగ్గు తేల్చడానికి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. కాగా ఏడాది క్రితం కాంట్రాక్టర్ హైకోర్టుకెళ్లగా, ఇటీవల ఇరిగేషన్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. విజిలెన్స్ విచారణ జరుగుతున్న నేపథ్యంలో బిల్లు చెల్లింపు సాధ్యం కాదని స్పష్టం చేశారు.

కబ్జా చేసినా.. కిమ్మనలేదు !

● సూరాయపాలెంలో ప్రభుత్వ భూమి ఆక్రమణ
● పేదల పేరుతో పట్టాలు.. పెద్దల చేతుల్లో భూములు
● ఆధారాలతో సహా తేల్చిన రెవెన్యూ అధికారులు
● ఇప్పటికీ ఆక్రమణలు తొలగించని వైనం
● వైసీపీ నేతల ఒత్తిడికి లొంగుతున్న అధికారులు ?

నెల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు మండలం సూరాయపాలెంలోని సర్వే నంబరు 352లో 36.69 ఎకరాల మేత పోరంబోకు భూమి ఉంది. పెన్నానదికి సమీపంలో ఉండటంతో ఈ భూమికి మంచి విలువుంది. కొన్ని శతాబ్దాల నుంచి ఆ చుట్టు పక్కల గ్రామాల్లోని మూగ జీవాల మేతకు ఈ భూమి ఉపయోగపడేది. బ్రిటీషు కాలం నాటి రెవెన్యూ రికార్డుల నుంచే ఈ భూమి మేత పోరంబోకుగా నమోదై ఉంది. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి నాయకుల కళ్లు ఈ భూమిపై పడ్డాయి. అదే తడవుగా తొలుత 10 ఎకరాలను ఆక్రమించారు. ఆ భూమిలో సవక చెట్లు నాటారు. ఆ తర్వాత భూమి లేని నిరుపేదలకు ఈ భూమిని పంపిణీ చేసినట్లు రికార్డుల్లో రాసుకొని వైసీపీ నేతలు స్వాహా చేశారు. ఇలా ఆక్రమించిన భూమిలో మామిడి చెట్లు సాగు చేస్తున్నారు. నాడు ఎన్ని ఆరోపణలు, ఫిర్యాదులు అందినా, రెవెన్యూ అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూసే సాహసం కూడా చేయలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఆక్రమాలపై విచారణ ప్రారంభించారు. పొదలకూరు తహసీల్దార్ గ్రామం లోకి వెళ్లి గ్రామసభ నిర్వహించారు. ఆ మేతపోరంబోకు భూమిని పంపిణీ చేయడానికి కుదరదని చెబుతూనే, ఎవరెవరి పేర్లపై పట్టాలు ఇచ్చారో చదివి వినిపించారు. అయితే ఆ పట్టాదారులెవరికీ వారి పేరుపై మేత పోరంబోకు భూమిని మంజూరు చేసినట్లు తెలియకపోవడం గమనార్హం. నాడు అధికార దర్పంతో ఆక్రమణదారులు ఈ విషయాలు బయటకు రాకుండా చూసుకున్నారు.

● నోటీసులిచ్చి వదిలేశారు..!

మేత పోరంబోకు భూమి ఆక్రమణ వ్యవహారంలో జరిగిన అవకతవకలను నివేదిక రూపంలో తహసీల్దార్ జిల్లా ఉన్నతాధికారులకు పంపారు. అయితే ఇది జరిగి నెలలు గడుస్తున్నా ఇంత వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సాగు చేస్తున్న వారికి నోటీసులిచ్చి వదిలేశారు. గతంలో ఆ భూమిలోకి ఎవరూ వెళ్లడానికి లేదని తహసీల్దార్ పేరుతో బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ ఆ బోర్డులు పోయి ఇప్పుడు సాగు జరుగుతోంది.



సూరాయపాలెంలోని మేత పోరంబోకు భూమిలో నాటిన మామిడి చెట్లు

పేదలకు తెలియకుండా వారి పేర్లపై పట్టాలు ఇచ్చి, వేరొకరు భూమిని అనుభవంలో పెట్టుకోవడం మరో రకమైన నేరమని రెవెన్యూ నిపుణులు చెబుతున్నారు. మరి ఏ రకంగానూ ఈ మేతపోరంబోకు భూమి వ్యవహారంలో అడుగులు ముందుకు పడకపోతుండడంతో అనేక ప్రచారాలు ఊపందుకున్నాయి. వైసీపీ నేతల ఒత్తిళ్లకు జిల్లా అధికారులు తలొగ్గుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. కాగా ఈ విషయమై నెల్లూరు ఆర్డీవో అనూషను వివరణ కోరగా తహసీల్దార్ నుంచి నివేదిక వచ్చిందని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉదయగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ ఖుద్దూస్‌బాషా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వరికుంటపాడు, ఉదయగిరి, కుర్రపల్లి, పెద్దిరెడ్డిపల్లి, గండిపాళెం, సీతారామపురం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10469
వెండి కిలో ధర	రూ. 132600
వెండి ఒక గ్రాము	రూ. 135.60

మొక్కుబడి వైద్య సేవలతో రోగుల అవస్థలు

● పట్టించుకోని అధికారులు



వరికుంటపాడులోని ప్రభుత్వ వైద్యశాల

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వరికుంటపాడు ప్రభుత్వ వైద్యశాలలో వైద్య సేవలు నిరుపేద రోగులకు అందని ద్రాక్షగానే ఊరిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ రహదారికి అనుకొని ఉండడంతో వ్యాధులతో పాటు ప్రమాదాలు జరిగిన సమయాల్లో పరుగులు తీసిన వారికి మొక్కుబడి వైద్యసేవలే అందడంతో నిరాశగా వెనుతిరగాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లా కేంద్రానికి శివారున 24 పంచాయతీల పరిధిలోని ఆ వైద్యశాల పేరుకే 24 గంటల వైద్యశాలగా మారిందని పలు గ్రామాల రోగుల నుంచి ఆరోపణలు విన్పిస్తున్నాయి. వైద్యం కోసం అక్కడికి పరుగులు తీసిన రోగులకు కింది స్థాయి సిబ్బంది నామమాత్రపు సేవలు అందించి చేతులు దులుపుకుంటున్నారని, పట్టించుకొనే నాధులే కరువయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లా కేంద్రానికి దూరంగా మెట్ట ప్రాంతం కావడంతో ఉన్నతాధికారుల తనిఖీలు ఉండవనే ధీమాతోనే కొంతమంది అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిసున్నారు. విధులకు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియని అయోమయ పరిస్థితుల్లో వారి రాక కోసం రోగులు గంటల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో చేసేదేమి లేక అంతా తామే అన్న చందంగా వ్యవహరిస్తున్న సిబ్బంది అందించే ఇంజక్షన్లు, మాత్రలతోనే మౌనంగా వెనుతిరగాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు. మెరుగైన వైద్యం కోసం పట్టణాల్లోని ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది.

హెచ్చరికలు బేఖాతరు

ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో గత నెల 19న ఆకస్మిక తనిఖీ చేపట్టిన కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మజ సాక్షాత్తు అక్కడి పరిస్థితిని చూసి విస్తుపోయారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడాన్ని గమనించిన ఆమె విధులు సక్రమంగా నిర్వహించడం లేదంటూ వైద్యురాలిపై అసహనం వ్యక్తం చేశారు. ఇకనైనా పద్ధతి మార్చుకొని జాగ్రత్తగా వ్యవహరించాలని వైద్యులు, ఉద్యోగులను ఆదేశించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

న్యూస్ బాక్స్


భూ సమస్యలు పరిష్కరించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో

వింజమూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూసమస్యలు క్కువగా ఉన్నాయని, తక్షణమే పరిష్కరించాలని కావలి ఆర్డీవో వంశీకృష్ణ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో జరిగిన అవకత వకలను వెంటనే సరిదిద్దాలని, రెవెన్యూ సమస్యలపై ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సులభ రీతిలో విద్యాబోధన చేయాలి



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

ఉదయగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు సులభ రీతిలో విద్యాబోధన చేయాలని ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో వెంకటేశ్వర్లు, అర్లపడియ హరిజనవాడ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లు పరిశీలించి ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హనీఫ్, సురేష్, స్రవంతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మెరుగైన భోజనం అందించాలి



విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న ఎంఈవో మస్తాన్‌వలి

సీతారామపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం మెరుగైన భోజనం అందించాలని మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్‌వలి అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను శుక్రవారం ఎంఈవో ఆకస్మిక తనిఖీ చేసి భోజనాన్ని రుచి చూశారు. అనంతరం ప్రతి తరగతి గదిని పరిశీలించి విద్యాబోధన తీరును పరిశీలించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సమీరారెడ్డి, సీఆర్పీ కులారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల వైద్యఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి అయూబ్‌అఫ్సర్ సూచించారు. శుక్రవారం మండలంలోని జంగాలపల్లి గ్రామంలో జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీచేసి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఖాజా మొహిద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీ మానస, సిబ్బంది దేవి, సుధాకర్‌రాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండుకు కుర్చీల వితరణ

వింజమూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండుకు స్థానిక ధరణి సేవా సమితి ఆధ్వర్యంలో యల్లాల చిన్నవెంకటరెడ్డి, పుల్లమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కుర్చీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎస్‌ఆర్టీసీ ఉదయగిరి డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ శివకేశవ యాదవ్ మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం కుర్చీలను వితరణ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం దాతను ఆర్టీసీ అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధరణి సేవా సమితి ప్రతినిధి యల్లాల రఘురామిరెడ్డి, ఆర్టీసీ అసిస్టెంట్ ఇంజనీర్ సుభాషణం, ఉదయగిరి ఏటీసీ నాగభూషణం, యల్లాల రమణారెడ్డి, తిప్పిరెడ్డి రమేష్, పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కావలి డీఎల్పీఓ రాజశేఖర్

సీతారామపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కోఆపరేటివ్స్ సంవత్సరాన్ని పురస్కరించుకొని ఈనెల 6వ తేదీన అయ్యవారిపల్లి జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన వారికి శుక్రవారం కావలి డీఎల్సీఓ రాజశేఖర్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాసరచన పోటీల్లో 23మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి ప్రత్యేక బహుమతులతో పాటు, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో షేక్ మస్తాన్‌వలి, జడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు షఫీ అహ్మద్, ఉదయగిరి డిఎల్సిఓ శ్రీనివాసులురెడ్డి, సొసైటీ సీఈఓ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్విజ్, పద్య పోటీల్లో విజేతలకు బహుమతులు

ఆత్మకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి వేడుకలను తెలుగుభారతి సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మేధా ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు క్విజ్, పద్య పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో అపస్మా గౌరవాధ్యక్షుడు టీసీ వెంకటసుబ్బయ్య, తెలుగు భారతి సేవాసమితి వ్యవస్థాపకుడు ఎస్వి చలమయ్య, గౌరవ సలహాదారు సోమవారపు యానాదిరెడ్డి, సహాధ్యక్షుడు కొల్లా వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు ఎస్వీ రమణయ్య, ఏ గోవిందరెడ్డి, వెలిశెట్టి నారాయణరావు, డి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి కృషి



బ్యాంకును సందర్శించిన ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ నాయకులు

సంగం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విధులు నిర్వహించే ఉద్యోగులు, ఖాతాదారుల సమస్యలను రీజనల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ స్టేట్ నాయకులు గిరిధర్, డిజిఎస్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం వారు సంగంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌ని సందర్శించారు. బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్టవ్యాప్తంగా ఎస్‌బీఐ బ్రాంచ్‌లను సందర్శించి ఉద్యోగులు, ఖాతాదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు యూనియన్ నాయకులు రీజినల్ సెక్రటరీ సనత్ కుమార్, ఆర్గనైజర్ సెక్రటరీ గిరిధర్, స్థానిక బ్యాంక్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోండి

వింజమూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ పోస్టుమాస్టర్ రఫీ సూచించారు. శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తపాలా శాఖలో సుకన్య సమృద్ధి యోజన పథకం ఆడపిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఆర్డీ అకౌంట్ చేయడం వలన భవిష్యత్తులో నగదు మొత్తం ఒక్కసారిగా తీసుకునే వెసులుబాటు ఉంటుందని వారు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

సీతారామపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బార్బర్ షాపు నిర్వహించే ఎడమకంటి సుబ్రహ్మణ్యం ఇటీవల అనారోగానికి గురై కంటిచూపును కోల్పోయారు. ఈనేపథ్యంలో ఆయన వైద్యఖర్చుల కోసం జనసేన పార్టీ నాసేన కోసం నావంతు రాష్ట్ర కమిటీ మెంబర్ భోగినేని కాశీరావు రూ.10 వేలు నగదును శుక్రవారం సుబ్రహ్మణ్యంకు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల మాజీ కన్వీనర్ ముత్తంశెట్టి చెన్నకేశవులు, జనసేన పార్టీ మండల నాయకుడు భోగినేని కాశీరత్తయ్య, నీలిరత్తయ్య, తోట ఏడుకొండలు, మురళి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త నిరసన



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ సిబ్బంది

సీతారామపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని సచివాలయ సిబ్బంది పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఎంపీడీవో సాయి ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటి సర్వేల నుంచి విముక్తి కలిగించాలని, సమయ పాలనకు సంబంధించిన నిబంధనలు సడలించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లతో పాటు ఆరేళ్లగా ఒకే క్యాడర్లో పనిచేసిన వారికి ప్రత్యేక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుతం అమలవుతున్న రికార్డ్ అసిస్టెంట్ కేడర్‌ను జూనియర్ అసిస్టెంట్‌గా మార్పు చేయాలన్నారు. సెలవులు, పండుగలతో పాటు ఆదివారం కూడా విధులు నిర్వర్తించాలని ఒత్తిడి చేయడం తగదన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలకు 15 రోజులలో పరిష్కారం చూపకపోతే దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు వంశీకృష్ణారెడ్డి, నాగరాజు, హసనయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు జాన్సన్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి : ఆర్డీవో



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో పావని

ఏఎస్ పేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాయబ్ రసూల్ దర్గా గంధ మహోత్సవానికి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆత్మకూరు ఆర్డీవో పావని తెలిపారు. శుక్రవారం ఆమె ఏఎస్ పేటకు విచ్చేశారు. ఈనెల 18వ తేదీ నుంచి నాయబ్ రసూల్ దర్గా గంధ మహోత్సవం జరగనుండడంతో దర్గా పరిసరాలను, గ్రామ వీధులలో తిరిగి వాహనాల పార్కింగ్, దుకాణాలు, దర్గా దర్శనం క్యూలైన్లు తదితర ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారులు, నాయకులు అందరూ కలసికట్టుగా పనిచేసి గంధ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సిఐ వేమారెడ్డి, తహసీల్దారు అనిల్ కుమార్, దర్గా ఈవో మహమ్మద్ హుసేన్, టిడిపి మండల అధ్యక్షుడు అబ్బురి రమేష్‌నాయుడు, నాయకులు షేక్ జిలానిబాషా, పులిమి సుధాకర్‌రెడ్డి, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పసుపు సాగుపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖాధికారి

ఉదయగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పసుపు పంట సాగులో రైతులు తగిన మెలవకులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖాధికారిణి జయశ్రీ సూచించారు. శుక్రవారం మండలంలోని బండగానిపల్లి రైతుసేవా కేంద్రంలో పసుపు రైతులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటకు ఎరువులు, పురుగు మందులు వాడే విషయంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ-పంట తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం సాగులో ఉన్న పంటలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత



మృతుల కుటుంబాలకు నగదును అందజేస్తున్న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలకు శుక్రవారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి వారి ఇళ్లకు వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. 1వ వార్డు పరిధిలోని కప్పల పుల్లమ్మ, దాసరి వెంకటేశ్వర్లు, 2వ వార్డు పరిధిలో గాలి బెనర్జీ, 3వ వార్డులో షేక్ అబ్దుల్‌రవూఫ్, 5వ వార్డులో పసుపులేటి మునిస్వామి, 11వ వార్డులోని కరటంపాటి కృష్ణయ్య, 15వ వార్డులోని షేక్ మస్తాన్‌బీ, రాల్లూరి లక్ష్మీదేవి, 16వ వార్డులోని షేక్ మస్తాన్, 19వ వార్డులో పరిధిలోని షేక్ మహబున్నీ కుటుంబాలను ఆయన పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల వంతున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు శేషారెడ్డి, బిజెపి పట్టణ మాజీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి యూరియా వాడకం అనర్థదాయకం



సంగం: యూరియా వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సంగం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మోతాదుకు మించి యూరియా వాడకం అనర్థ దాయకమని కోవూరు అగ్రికల్చర్ సహాయ సంచాలకులు అనిత పేర్కొన్నారు. శుక్రవారం ఆమె స్థానిక వ్యవసాయాధికారి వి శశిధర్‌తో కలిసి మండలంలోని నీలాయపాళెం, కొరిమెర్ల రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె రైతుల అవగాహన సదస్సులో మోతాదుకు మించి యూరియా వాడితే జరిగే నష్టాలు, అనర్థాల గురించి రైతులకు వివరించారు. అధికంగా యూరియా వాడడం వల్ల ఖర్చులు పెరగడంతోపాటు నేల సారాన్ని దెబ్బతీస్తుందన్నారు. జీవన ఎరువులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

● **ఉదయగిరి :** పంటల సాగులో రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడితే భూమిలో ఉన్న సూక్ష్మజీవులు నశించి పంటకు పోషకాలు అందక దెబ్బతినే అవకాశముందని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ సూచించారు. శుక్రవారం మండలంలోని కృష్ణంపల్లి రైతుసేవా కేంద్రం పరిధిలో మోతాదుకు మించి ఎరువులు వాడితే కలిగే నష్టాలపై అవగాహన కల్పించి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, కల్యాణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● **దుత్తలూరు:** మండలంలోని లక్ష్మీపురం రైతుసేవా కేంద్రంలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి మదన్ మోహన్ యూరియా వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎండీఎస్ కిట్లలో 20 రకాల విత్తనాలు కలిగి ఉండడం వలన భూమిలో చల్లుకున్నట్లయితే భూమి పొరల్లో ఉండే పోషకాలు మొక్కలకు అందుతాయన్నారు. తద్వారా ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో లోకనాథ్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

కొన్నట్లు నటిస్తూ.. నగలు కొట్టేస్తూ..

● దొంగతనం చేస్తూ పట్టుపడిన కి'లేడీ'లు



పట్టుబడ్డ మహిళలను విచారిస్తున్న పోలీసులు

ఉలవపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బంగారం షాపులో నగలు కొనుగోలు చేస్తున్నట్లు వ్యవహరించి, ఆభరణాలు దొంగిలిస్తూ పట్టుబడిన ఇద్దరు మహిళలపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. కృష్ణాజిల్లా, ఇర్లపాడు మండలం గోకరాజుపల్లికి చెందిన ఇద్దరు మహిళలు శుక్రవారం ఉలవపాడు కృష్ణానగర్‌లోని సాబ్‌జాన్ గోల్డ్‌షాపులో నగలు కొనుగోలు చేసేందుకు వచ్చారు. గత నెలలో ఈ ఇద్దరు మహిళలు ఇలాగే ఆభరణాలు కొనేందుకు వచ్చి రూ. లక్ష విలువ చేసే 4 జతల బంగారు కమ్మలు దొంగిలించుకువెళ్లారు. అనుమానం వచ్చిన షాపు యజమాని సీసీ ఫుటేజీల ద్వారా మహిళలను గుర్తించారు. గత నెలలో దొంగతనం చేసిన ఈ మహిళలు శుక్రవారం మరోసారి రాగా వెంటనే గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఇద్దరు మహిళలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. గోల్డ్‌షాపు గుమస్తా షేక్ సుల్తాన్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంగతనానికి పాల్పడిన ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో అధికారులు వెల్లడించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏసీ దయాసాగర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సూపరింటెండెంట్ జగదీశ్వరరెడ్డి పర్యవేక్షణలో అధికారులు శుక్రవారం వెంకటేశ్వరపురంలో గంజాయి అక్రమ విక్రయాలపై దాడులు నిర్వహించారు. గంజాయి విక్రయిస్తున్న ఎస్‌డీ మౌలాలిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతనిని జిల్లా ప్రొహిబిషన్ కార్యాలయానికి తరలించి విచారించారు. అలాగే కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంకు చెందిన అరవ ఓమ్రేష్ గంజాయి విక్రయాలు చేసున్నట్లు గుర్తించి అతనిని అదుపులోకి తీసుకుని అతని వద్ద 2 కిలోల 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిరువురిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అనిత, సబ్‌ఇన్‌స్పెక్టర్ సీహెచ్ పూర్ణకుమార్, హెడ్‌కానిస్టేబుల్స్ ఏ.రమేష్‌కుమార్, ఎం.కిరణ్‌సింగ్, ఎస్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తండ్రి డబ్బులు లేవని చెప్పడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొదుతూ మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న పెంచల ప్రసాద్(21) ఐటీఐ వరకు చదువుకుని ఇంటివద్దే ఉంటున్నాడు. ఈనెల 7వ తేదీన ఆయన ఫ్రైండ్స్‌కు పార్టీ ఇచ్చేందుకు నగదు ఇవ్వాలని తండ్రి పెంచలయ్యను అడుగగా లేవని చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన పెంచల ప్రసాద్ అదే రోజు రాత్రి తన ఇంట్లో ఎలుకుల మందు తిని అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నారాయణ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు బాధిత తండ్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వీడియోగ్రాఫర్‌కు తీవ్ర గాయాలు



ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న కృష్ణ

కావలి రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం గౌరవరం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం రాత్రి ముందు వెళ్తున్న గుర్తుతెలియని లారీని వెనుక వైపు మోటారు బైక్ ఢీకొన్న ప్రమాదంలో వీడియోగ్రాఫర్ గంపాల కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాన్ని గుర్తించిన హైవే మొబైల్ సిబ్బంది క్షతగాత్రున్ని హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అతని వద్ద లభించిన ఆధారాల ప్రకారం బోగోలు మండలం ముంగమూరుకు చెందిన క్రిష్ణ వీడియోస్ నిర్వాహకుడు కృష్ణ కావలి నుండి ముంగమూరుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు రూరల్ ఎస్ఐ తిరుమల రెడ్డి గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చాడు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం క్రిష్ణను 108 వాహనంలో నెల్లూరుకు తరలించారు. ఎస్ఐ తిరుమల రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



దగ్ధమవుతున్న పూరిల్లు

కావలి రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన కావలి మండలం ఆనెమడుగు పంచాయతీ బైనేటివారిపాలెంలో గురువారం రాత్రి జరిగింది. అగ్నిమాపక శాఖ అధికారులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు... బైనేటివారిపాలెం గ్రామానికి చెందిన పరుసు వేణుకు చెందిన పూరింట్లో పరుసు రాఘవులు, రమ వారి నలుగురు కుమారైలతో ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించటంతో వారు గుర్తించి ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీసి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. వారు వచ్చేసరికి ఇల్లు పూర్తిగా దగ్ధం అయింది. ఈ ప్రమాదంలో వారి బట్టలు, సామగ్రి మొత్తం కాలి బూడిద కాగా సుమారు రూ.50వేల ఆస్తినష్టం వాటిల్లిందని, అధికారులు ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	141
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	274

కోడిగుడ్ల ధర (100): 550



సార్... మా ఊరికి రోడ్డెయ్యండి!

కొండాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి రహదారి ఏర్పాటుచేయాలంటూ మండలంలోని గరిమెనపెంట పంచాయతీ గజ్జలవారిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వివరాల మేరకు.. గరిమెనపెంట గ్రామం నుండి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న గజ్జలవారిపల్లె గ్రామానికి మట్టి రోడ్డు ఉంది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డులోని గుంతలలో నీరుచేరి వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. శుక్రవారం ఉదయం విద్యార్థులు, గ్రామస్థులతో వెళ్తున్న ఆటో మట్టిలో దిగబడిపోయింది. దీంతో విద్యార్థులు ఆటోను నెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలం మొత్తం ఇదే సమస్య ఉంటుందని, తమ గ్రామానికి రహదారి నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ, పరిసర ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వసంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మతుల దృష్ట్యా పట్టణం లోని వెంగళరావునగర్, ఇందిరానగర్, బాలక్రిష్ణారెడ్డినగర్, తుఫాన్‌నగర్, జనతాపేట సౌత్, ముస్సిపల్ ఫ్లాట్స్, పెంకుల ఫ్యాక్టరీ సంగం, వైకుంఠపురం ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బిట్రగుంటలో...

బిట్రగుంట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల శాఖ అధికారి జడరాయ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంచులక్ష్మీపురం, జేపీగూడూరు, ముంగమూరు, వడ్డిపాలెంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో సిబ్బంది మరమ్మతులు చేయనున్నారని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

లింగసముద్రంలో...

లింగసముద్రం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచెర్ల, లింగసముద్రం సబ్ స్టేషన్లలో శనివారం ఆర్డీఎస్ మెయింటెనెన్స్ పనులు జరుగుతున్నందున ఉదయం 8.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ షేక్ ఫిరోజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మొగిలిచెర్ల, నారసింహపురం, ఆర్ఆర్ పాలెం, పెంట్రాల, రాళ్లపాడు, లింగసముద్రం, వెంగళాపురం, తిమ్మారెడ్డిపాలెం గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్

కావలి రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం రుద్రకోటలోని విక్కీ వైన్స్ సూపర్‌వైజర్‌పై బీరు బాటిల్‌తో దాడిచేసిన ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ బాజీబాబు తెలిపారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గురువారం సాయంత్రం రుద్రకోటలోని వైన్స్ దుకాణం వద్ద బీరుబాటిళ్లు తీసుకునే విషయంలో జరిగిన గొడవలో అక్కడ పనిచేస్తున్న సూపర్‌వైజర్ జరుగుమల్లి సందీప్‌పై గుడ్లూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు బీరు బాటిల్‌తో దాడి చేసి పరారయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు నిందితులను గుర్తించి గుడ్లూరు సెంటర్‌లో తిరుగుతుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బాజీబాబు తెలిపారు.

రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై కేసు

అల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. అల్లూరు మండలం పురిణిలో 300 కిలోల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆటోను అదుపులోకి తీసుకున్నారు. ఆటోలోని సరుకుని స్వాధీనం చేసుకొని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో వీఆర్ఏ మృతి



లక్ష్మీనారాయణ భార్య స్వాతికి నగదు అందచేస్తున్న డీటీ శ్యామ్

కొండాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మర్రిగుంట వీఆర్ఏ పర్రె లక్ష్మీనారాయణ(33) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. తహసీల్దార్ సురేష్‌బాబు, డీటీ శ్యామ్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్ఏలు లక్ష్మీనారాయణ మృతదేహానికి నివాళులర్పించారు. ప్రభుత్వ సహాయంగా మట్టిఖర్చుల నిమిత్తం రూ. 25 వేల నగదును భార్య స్వాతికి అందచేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 4 వర్కర్, 66 హెల్పర్స్ పోస్టులకు 147 మంది అభ్యర్థులు హాజరయ్యారు. దీంతో నెల్లూరు ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఆర్డీవో అనూష, ఐసీడీఎస్ పీడీ హేన సుజాన్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆరోగ్య శాఖ అధికారి బ్రమ్మేష్‌నాయుడు, ఆర్డీవో కార్యాలయ ఏవో నిర్మలానందబాబా, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

'అధ్వాన' భోజనం!

- అన్నం ముద్దముద్దగా.. కూరలు నీళ్ల నీళ్లగా...
- ఇంటినుండి భోజనం తెచ్చుకుంటున్న విద్యార్థులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వాస్తవాలు వెలుగులోకి...



తిమ్మారెడ్డిపాలెం స్కూల్‌లో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు

లింగసముద్రం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని కాస్త.. 'అధ్వాన' భోజన పథకంగా మార్చేశారు. విద్యార్థుల ఆకలి తీర్చాలన్న సంకల్పంతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఏపీ ప్రభుత్వం ఓవైపు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుంటే.. మరోవైపు.. అధికారుల పర్యవేక్షణ లోపం.. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుల స్వార్థం వల్ల మధ్యాహ్నవేళ.. రేపటి పౌరుల డొక్కలు ఎండుతున్నాయి.

రుచి.. శుచి లేక డస్ట్‌బిన్ లోకి...

మండలంలోని పలు పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అధ్వానంగా ఉంటోంది. కూరలు కూడా రుచిగా, శుచిగా ఉండడం లేదు. వారంలో ఒక్కోసారి కోడిగుడ్డు కూడా ఇవ్వడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. ఇటీవల పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం ప్రభుత్వం సన్న బియ్యం



డస్ట్ బిన్‌లో పడేసిన భోజనం

సరఫరా చేస్తోంది. అయితే చాలాచోట్ల అన్నం ముద్దగా ఉంటోంది. దీంతో విద్యార్థులు తినలేక డస్ట్‌బిన్‌లో పడేస్తున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనాన్ని విద్యాశాఖాధికారులు తనిఖీ చేయకపోవడం వల్ల ఈ దుస్థితి నెలకొందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● వెలుగు చూసిన వాస్తవాలివే..

శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్ పెట్టింది. వెంగళాపురంలోని పాఠశాల, తిమ్మారెడ్డిపాలెంలోని ఏపీ మోడల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించగా, రెండుచోట్ల మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించారు. వెంగళాపురంలో అన్నం కొంత ముద్దగా ఉంది. మోడల్ స్కూల్లో కూడా అన్నం ముద్దగా ఉంది. ఈ పాఠశాలలో కొందరు విద్యార్థినులు ఇంటి వద్ద నుండి భోజనం తెచ్చుకొని తినడం కనిపించింది. కొందరు విద్యార్థులు అన్నం సగం తిని, సగం తినలేక డస్ట్‌బిన్‌లో పడేశారు. ముద్దగా ఉన్న అన్నం తినలేక పోతున్నట్టు చాలా మంది విద్యార్థులు చెబుతున్నారు. ముఖ్యంగా ప్రిన్సిపాల్ పని మీద బయటకు వెళ్లిన రోజు భోజనం బాగుండదని, ఆ రోజు కోడిగుడ్లు కూడా ఇవ్వరని పలువురు విద్యార్థులు ప్రిన్సిపాల్ ఎదుటే చెప్పారు. ఇలా.. మండలంలోని చాలా పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కూరలు రుచిగా ఉండడం లేదు. నీళ్ల నీళ్లగా ఉంటున్నాయి. దీంతో రుచి లేని అన్నం తినలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తలిదండ్రులు కోరుతున్నారు.

విత్తన డీలర్లు నిబంధనలు పాటించకుంటే చర్యలు

- రూ. 2.24 లక్షల విలువైన విత్తన విక్రయాల నిలిపివేత

కందుకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విత్తనాల డీలర్లు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీం హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని అన్నదాత సీడ్స్ దుకాణంలో తనిఖీలు నిర్వహించి, రూ. 2.24 లక్షల విలువైన వివిధ రకాల విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేస్తూ నోటీసు జారీ చేశారు. విత్తన లైసెన్సును పునరుద్ధరించుకోకపోవటం, ధరల పట్టికను ప్రదర్శించకపోవటంతో పాటు రైతులకు విత్తనాల విక్రయానికి సంబంధించి రశీదులు ఇవ్వకపోవటం వంటి లోపాలను గుర్తించారు. లోపాలను సవరించుకోవాలని, లేని పక్షంలో లైసెన్సు రద్దుచేస్తామని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసే ప్రతీ రైతు విధిగా అడిగి రశీదు తీసుకోవాలని, రశీదు లేనిదే భవిష్యత్తులో రైతులకు జరిగే నష్టానికి న్యాయం చేయలేమని తెలిపారు. ఎవరైనా విత్తన డీలర్లు రశీదులు ఇవ్వకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

వాతావరణంలో మార్పులతో రైతుల్లో ఆందోళన

అల్లూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులతో రైతుల్లో ఆందోళన నెలకొంది. శుక్రవారం ఉదయం నుంచి వాతావరణం చల్లబడి చినుకులు పడుతుండడంతో మండలంలోని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వరికోతలు ముమ్మరంగా జరుగుతున్న క్రమంలో వర్షం కురిస్తే వారి పరిస్థితి దయనీయంగా మారుతుంది. ఇప్పటికే ధరలు దిగజారుతుండడంతో వర్షం కురిస్తే మరింత దిగజార్చి దళారులు రైతులను దోచేయడంతోపాటు వరికోత యంత్రాల యజమానులు కూడా ధరలు పెంచేసే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే 1010 రకాలు రూ14200కు పడిపోవడంతో రైతులు నిరాశకు గురవుతు న్నారు. వర్షం కురిస్తే ఈ ధరలు ఇంకా దిగజారిపోతాయే మోనని భయాందోళనకు గురవుతున్నారు.



కోతలు ముగియడంతో విక్రయానికి సిద్ధంగా ధాన్యం

రైతులకు ఇఫ్కో ఉచిత బీమా



మాట్లాడుతున్న ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ

బిట్రగుంట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పైరు నాటిన 20 నుంచి 25 రోజుల తరువాత నానో యూరియాని వాడడం వలన మొక్కల్లో పోషక సామర్థ్యం పెరుగుతుందని, ఒక బాటిల్ కొనుగోలుకు పదివేల రూపాయల చొప్పున గరిష్ఠంగా రెండు లక్షల వరకు ఉచిత బీమా పథకం రైతులకు ఇఫ్కో సంస్థ అందిస్తుందని సంస్థ మేనేజర్ లక్ష్మీనారాయణ అన్నారు. బోగోలు మండలం ముంగమూరు గ్రామ సచివాలయంలో మండల ఎంఏవో శైలజ ఆధ్వర్యంలో భూమి ఆరోగ్యం, పోషకాల ప్రాముఖ్యతపై శుక్రవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్ర అధికారి సీ మారుతిదేవి హాజరై భూమి ఆరోగ్యం, పోషకాల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. అధిక మోతాదులో యూరియా వాడకం వల్ల పైరు పెరిగి పురుగులు, తెగుళ్ళు ఎక్కువగా ఆశించడానికి అవకాశం ఉంటుందని, అధికంగా రసాయనిక ఎరువుల వాడకం మాని కంపోస్ట్, పశువుల పేడ, పచ్చిరొట్ట, పిఎండిఎస్ కిట్ల వాడకం వలన భూసారం పెరుగుతుందని కావలి ఏడిఏ సీహెచ్ నాగరాజు అన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన శక్తివంతమైన ఆహారాన్ని పండించవచ్చని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త సుకుమార్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, శ్రీనివాసులురెడ్డి, గ్రామ రైతులు, ఏఈఓ పోలు, విఏఏ యానాది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : ఏపీటీఎఫ్ 257



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

కలిగిరి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ 257 ఉపాధ్యాయ సంఘ నాయకులు శుక్రవారం తహసీల్దారు గిరీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బకాయిలు విడుదల చేయడంలో కానీ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు అందించడంలో గానీ ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ వహించడం లేదని, దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయటం, సీపీఎస్‌ను రద్దు చేయటం, యాప్‌లను అసెస్మెంటు బుక్‌లెట్ విధానాలను రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్న అంశాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించడం మంచిది కాదన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి ఐఆర్‌లు ప్రకటించాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ. 25 లక్షలకు పెంచి సమస్యల పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రమణయ్య, శ్రీనివాసులు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'అవినీతి' రిమోట్‌లు..

ఈ 'షాడో' మేటీలు!

- 'ఉపాధి'లో ఊరూరా 'షాడో' మేటీలు!
- నేటికీ గత ప్రభుత్వ మేటీల హవా
- దొంగ మస్టర్లకు సహకరిస్తున్న ప్రస్తుత మేటీలు

ఉలవపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం మారిపోయి ఏడాది దాటినా ఉపాధి పనుల్లో మాత్రం నేటికీ గత ప్రభుత్వ మేటీల హవా మండలంలో నేటికీ కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక గత ప్రభుత్వంలో పనిచేసిన మేటీలు అవినీతికి పాల్పడ్డారని నిర్ధారణకు వచ్చింది. వారి స్థానంలో ప్రతి 50 మంది ఉపాధి కూలీలకు ఒక మేటీ లెక్కన నియమించి పారదర్శకంగా పనులు చేయించాలని అధికారులు భావించారు. అయితే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న మేటీలు మాత్రం వైసీపీ ప్రభుత్వంలో పని చేసిన మేటీల నుండి అవినీతి పాఠాలు నేర్చుకుంటున్నారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న మేటీలకు అవినీతి సలహాలు, సూచనలు ఇచ్చినందుకు గాను.. వైసీపీ ప్రభుత్వంలో పని చేసిన మేటీలు యథావిధిగా వారికి సంబంధించిన వ్యక్తులకు పని డిమాండ్లు, దొంగ మస్టర్లు వేసుకున్నా చూసీ చూడనట్లు వదిలేయాలన్నది ఒప్పందం. ఈ క్రమంలో పాత మేటీల హవా నేటికీ కొనసాగుతుండగా అవినీతి మరకలు మాత్రం రాష్ట్ర ప్రభుత్వానికి అంటగడుతున్నారని తెలుగు తమ్ముళ్లలో ఆవేదన వ్యక్తం అవుతోంది.



రాజుపాలెం చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పనికి రాకున్నా.. ఖాతాల్లోకి డబ్బు జమ

మచ్చుకి ఉలవపాడు పంచాయతీ పరిధిలో ఆన్‌లైన్ రికార్డుల పరంగా 3281 జాబు కార్డులు ఉండగా ప్రస్తుతం యాక్టివ్‌లో ఉండి సుమారు 1700 జాబ్ కార్డులు మాత్రమే. ఉలవపాడు పంచాయతీ పరిధిలో మేటీలు 15 మంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మేటీలకు విధి నిర్వహణ, ఉపాధి పనుల డిమాండ్, మస్టర్లు వంటివి తెలియకపోవడంతో గత ప్రభుత్వంలో పని చేసిన మేటీల మీదనే ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో పని చేస్తున్న మేటీలకు కనీసం కూలీల డిమాండ్, మస్టర్లు చదవడం కూడా రాని పరిస్థితుల్లో పాత మేటీల సలహాలు, సూచనలు గత్యంతరం అయ్యాయి. దీనిని ఆసరాగా తీసుకున్న గత ప్రభుత్వంలో పనికి రాకుండా ఇళ్ల వద్ద ఉన్నప్పటికీ దొంగ మస్టర్లు వేసుకుని ఎవరైతే లాభాలు గడించారో ప్రస్తుతం కూడా వాళ్లే మస్టర్లు వేసుకొని పనికి రాకపోయినా వారి ఖాతాలకు డబ్బు పడేలా చూసుకుంటున్నారు. ఇదేబాటలో ప్రస్తుతం మేటీలు కూడా దొంగ మస్టర్లకు అలవాటు పడ్డారు.

పాత మేటీల వ్యవహారాలను అడ్డుకోలేరా?

గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడి ఉపాధి పనుల్లో రూ. లక్షలు సంపాదించడం రుచి మరిగిన పాత మేటీల హవాను అడ్డుకోవడంలో ఫీల్డ్ అసిస్టెంట్ విఫలం అయ్యారని గ్రామస్థులు అంటున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మేటీలే వారందరిని షాడోలుగా మార్చుకొని వారి అడుగుజాడల్లో నడుస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాంటప్పుడు వారిని ఏవిధంగా కట్టడి చేయగలమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఉలవపాడు ఉపాధి పనుల్లో భారీగా అవినీతి జరుగుతోందని, కట్టడి చేయాలని స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పలుమార్లు ఉపాధి హామీ అధికారులకు సూచించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో పనితీరు సక్రమంగా లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న ఫీల్డ్ అసిస్టెంటును మార్చి మరో వ్యక్తికి బాధ్యతలు అప్పగించారు. ఇకనైనా షాడో మేటీల ఆటలు కట్టించి, వారి అవినీతికి అడ్డుకట్ట వేయకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే ప్రమాదం ఉందని సర్వత్రా చర్చ జరుగుతోంది.

ప్రతీ ఇంటికీ మంచినీటి సరఫరానే లక్ష్యం

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి తాగునీరు అందించటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రశాంతి థియేటర్ ఎదురుగా ఉన్న వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన పైపులైను, ఇంటింటికీ మంచినీటి కుళాయిలను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించారు. గత ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చిన సందర్భంగా మహిళలు మంచినీటి సమస్యను తన దృష్టికి తెచ్చారని, ఆరోజు ఇచ్చిన హామీని నెరవేర్చామన్నారు. దీంతో స్థానిక మహిళలు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యేకి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె అనూష, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వేంకటేశ్వర్లు, షేక్ రఫీ, షబ్బీర్, కరీముల్లా, పద్మనాభుని సత్యం రమణయ్య, పేర్నమిట్ట శ్రీనుమస్తాన్, రసూల్, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, పోకూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును అడ్డుకున్న వైసీపీ నాయకుడు

- దిమ్మె ఏర్పాటుకు తీసిన గుంతలు పూడ్చివేత

కావలి రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ గాయత్రీనగర్‌లోని వేపకాయల మిల్ సందులో శుక్రవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును ఓ వైసీపీ నేత అడ్డుకున్నాడు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గత ఆరు నెలలుగా లోఓల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక టీడీపీ నేతల ద్వారా ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లటంతో సమస్య సత్వర పరిష్కారానికి ఆ ప్రాంతంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో విద్యుత్ శాఖ ఏఈ నాగార్జున స్థానికులతో కలిసి వేపకాయల మిల్ గోడ చివరి అంచున రోడ్డు మార్జిన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు రెండు రోజుల క్రితం దిమ్మె ఏర్పాటుకు గుంట తీయించారు. కాగా, శుక్రవారం అధికారులు దిమ్మె ఏర్పాటు పనులు చేపట్టేందుకు వెళ్లి చూడగా గుంటలు పూడ్చి ఉండటంతో పాటు అక్కడ ఉన్న వైసీపీ నాయకుడు దామిశెట్టి పూర్ణచంద్రయ్య తమ వేపకాయల మిల్లుకు వెళ్లేందుకు ట్రాన్స్‌ఫార్మర్ అడ్డు అవుతుందని పక్కకు జరిపి పెట్టుకోవాలంటూ అభ్యంతరం తెలిపాడు. వేపకాయల మిల్ గోడకు మెట్లు ఏర్పాటుచేసి గేటు పెట్టేందుకు అప్పటికప్పుడే పనులు చేపట్టడం అక్కడకు వచ్చిన స్థానికుల్లో చర్చనీయాంశమైంది. కాగా, ఏవైనా అభ్యంతరాలు ఉంటే గుంటలు తీయకముందు చెప్పిఉంటే ప్రత్యామ్నాయం చూసేవారమంటూ అక్కడే పక్కకు జరిపి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసే చర్యలు అధికారులు చేపట్టారు.



ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె గుంతలు పూడ్చి వేపకాయల మిల్ గోడకు మెట్లు కట్టించేందుకు పనులు చేస్తున్న కూలీలు

మిరప సాగు తగ్గిపోతోంది!

- తెగుళ్లు, వైరస్, గిట్టుబాటు ధర లేక విరామం
- సాధారణ విస్తీర్ణంలో నాల్గోవ వంతు కూడా అనుమానమే..

కందుకూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కందుకూరు డివిజన్‌లో మిర్చిసాగు విస్తీర్ణం గత రెండేళ్లుగా గణనీయంగా తగ్గిపోతోంది. ఈ ఏడాది పూర్తిస్థాయిలో సాగుకు రైతులు దూరమవుతోన్నారు. దీంతో సాధారణ సాగు విస్తీర్ణంలో నాలుగోవంతు కూడా సాగవడం కష్టమేనని అంచనా. మిర్చిసాగు అత్యంత వ్యయప్రయాసలతో కూడినది కావడంతో పాటు తామర పురుగు, వైరస్ తెగుళ్ల దెబ్బకు దిగుబడులు తగ్గడం, మరోవైపు గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోవడం పరిపాటిగా మారింది. దీంతో రైతులు మిర్చిసాగుకు దూరమవుతున్నారు. గడచిన 3, 4 ఏళ్లుగా మిర్చిసాగు చేసిన రైతులకు నష్టాలే మిగిలాయి. ఈ పరిస్థితుల్లో లక్షలాది రూపాయలు అప్పులు మూటగట్టుకున్న రైతులు సాగుకు విరామం ప్రకటించారు.

● నాలుగో వంతు కూడా అనుమానమే..

కందుకూరు డివిజన్‌లో వాణిజ్య పంటలలో పొగాకు తర్వాత మిర్చికే అత్యంత ప్రాధాన్యం. బావులు, బోర్లు, చెరువులు, కుంటలు ఆధారంగా రమారమి 4వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో మిర్చి సాగయ్యేది. కందుకూరు మండలంతో పాటు లింగసముద్రం, వలేటివారిపాలెం, గుడ్లూరు మండలాల్లోనూ, అడపాదడపా ఉలవపాడు మండలంలో కూడా మిర్చి సాగు చేస్తారు. అయితే కూలీ రేట్లు పెరగడంతో మిర్చిలో ప్రతిపనికీ మనుషుల అవసరం ఎక్కువ కనుక పెట్టుబడి వ్యయం అనూహ్యంగా పెరిగిపోయింది. దీనికి తోడు జెమినీ వైరస్ వదలకుండా మిర్చిరైతును వెంటాడుతున్న తామర పురుగుల నివారణకు ఎకరానికి రూ.లక్ష వరకు



పురుగుమందులు కోసం వెచ్చించినా ఆశించిన ఫలితాలు రాక దిగుబడులు తగ్గిపోయాయి. ఎకరం మిర్చి సాగుకు కనీసం రూ.3లక్షల వరకు ఖర్చవుతుండగా 10 క్వింటాళ్లకు మించి దిగుబడి రాని పరిస్థితి. దీంతో క్వింటాల్ రూ.30వేలు ధర పలికితే తప్ప రైతులకు పెట్టుబడి చేతికి రాకపోతుండగా గత రెండేళ్లుగా క్వింటాల్ రూ.10వేలు నుంచి రూ.12వేలు వరకు మాత్రమే ధర పలకటంతో ఎకరానికి రూ.2 లక్షల వరకు రైతులు నష్టపోయారు. మూడేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. దీనికితోడు కొందరు రైతులు గిట్టుబాటు ధరలపై ఆశతో కోల్డ్‌స్టోరేజీలలో నిల్వ చేసి వడ్డీలు పెరిగి మరింత నష్టపోయారు. చైనా, బంగ్లాదేశ్, శ్రీలంక తదితర దేశాలకు మిర్చి ఎగుమతులు నిలిచిపోవడంతో ధరలు పడిపోయాయని, ఇప్పుడిప్పుడే ఎగుమతి ఆర్డర్లు వస్తున్నాయని, భవిష్యత్తులో ధరలు ఆశాజనకంగా ఉండే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నప్పటికీ ఇప్పటికే పుట్టెడు అప్పులు చేసిన రైతులు మిర్చి సాగంటేనే హడలిపోతున్నారు.

● గణనీయంగా తగ్గిన నర్సరీలు

గత రెండేళ్లుగా మిర్చిసాగు పట్ల రైతులు విముఖత చూపడంతో సాగు విస్తీర్ణం మరింతగా తగ్గుతుందనే అంచనాతో నర్సరీల రైతులు కూడా పరిమాణం గణనీయంగా తగ్గించేశారు. గత ఏడాది 20 లక్షల మొక్కలు పెట్టే ఓ రైతు ఈ ఏడాది కేవలం 3 లక్షలతో సరిపెట్టుకోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. కొందరు పూర్తిగా మానేయగా, కొందరు విస్తీర్ణం భారీగా తగ్గించుకుని నర్సరీలు పెడుతున్నారు. దీంతో మిర్చి విత్తనాలకు కూడా డిమాండ్ తగ్గిపోయింది.



అన్నప్రసాదాలు వడ్డించిన దేశ ఆర్థికమంత్రి

తిరుమల అన్నప్రసాద భవనంలో కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ శుక్రవారం మధ్యాహ్నం సందడి చేశారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలు వడ్డించిన ఆమె, కొందరితో మాట్లాడారు. భక్తులతో కలిసి ఆమె కూడా అన్నప్రసాదాలు స్వీకరించారు. కేంద్రమంత్రితో పాటు బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, భానుప్రకాష్‌రెడ్డి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

చెత్త వారిదే.. ఫిర్యాదూ వారిదే!



తిరుపతి నగరం అలిపిరి-జూపార్కు మార్గంలో రోడ్డుకు రెండువైపులా ఉన్న చెత్తను శుభ్రం చేయడం లేదని టీటీడీ నుంచి ఇటీవల కార్పొరేషన్‌కు ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. ఈక్రమంలో కమిషనర్ మౌర్య అలిపిరి రోడ్డును పరిశీలించి చెత్త లేకుండా చూడాలని సూచించారు. ఎవరు చెత్త వేస్తున్నారో నిఘా పెట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈనేపథ్యంలో శుక్రవారం టీటీడీకి చెందిన ట్రాక్టర్లు జూపార్క్ రోడ్డులో చెత్తవేయడాన్ని మున్సిపల్ సిబ్బంది చూసి అడ్డుకున్నారు. ఫొటోలు తీసి కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. వారే చెత్త వేసి, వారే ఎలా ఫిర్యాదు చేస్తారని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. అపరాధ రుసుం వేయాలని అధికారులను ఆదేశించినట్టు సమాచారం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కొత్త సాంకేతిక సవాళ్లే అజెండా

- వీటిని ఎదుర్కొనేందుకు మహిళా సాధికారత
- రేపటి నుంచి తిరుపతిలో జాతీయ సదస్సు
- నేడు, రేపు రానున్న ప్రముఖులు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'కొత్త సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు మహిళల సాధికారత' అంశాన్ని అజెండాగా తీసుకుని తిరుపతిలో ఆది, సోమవారాల్లో జాతీయ మహిళా సాధికారత సదస్సు జరగనుంది. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా నేతృత్వంలో జరిగే ఈ సదస్సుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సదస్సులో 'వికసిత్‌భారత్ కోసం మహిళల అభివృద్ధి, జెండర్ రెస్పాన్సివ్ బడ్జెటింగ్ అంశాలకూ ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అలాగే భారత్ డిజిటల్ మార్పు, ఏఐ, మెషిన్ లెర్నింగ్, బ్లాక్ చెయిన్, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలపై చర్చ జరగనుంది. స్టెమ్‌మహిళల ప్రాతినిధ్యం పెంచడం, డిజిటల్ భద్రత, వ్యవసాయ రంగంలో మహిళల ప్రాతినిధ్యం పెంచడంపైనా చర్చించనున్నట్లు అధికార యంత్రాంగం తెలిపింది. 2047 నాటికి వికసిత్ భారత్ సాధనలో కొత్త సాంకేతిక ఆధారిత ఆర్థిక వ్యవస్థల్లో మహిళల చేర్పు వ్యూహాలపైనా చర్చించనున్నారు. ఈ సదస్సుకు పార్లమెంటుతో పాటు రాష్ట్రాల అసెంబ్లీల నుంచీ దాదాపు 250 మంది మహిళా ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. కాగా, సదస్సు జరిగే రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌ను శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇతర అధికారులు పరిశీలించారు. కన్వెన్షన్ సెంటర్‌లో సీటింగ్, వేదిక ఏర్పాట్లు క్రమపద్ధతిలో ఉండేలా చూడాలన్నారు.

వేదికపైన వీరే

'లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, రాష్ట్ర మంత్రులు, లోక్‌సభ కమిటీ చైర్‌పర్సన్ పురందేశ్వరి, రాష్ట్ర కమిటీ చైర్‌పర్సన్ గౌరు చరితారెడ్డి. ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు హాజరవుతారు. 15న జరిగే ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవుతారు' అని శాసనవ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ మీడియాకు తెలిపారు.



రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

నేడు పార్లమెంటు, అసెంబ్లీ స్పీకర్ల రాక

మహిళా సాధికారత సదస్సు నేపథ్యంలో శనివారం సాయంత్రానికే పలువురు ప్రముఖులు తిరుపతికి చేరుకోనున్నారు. వారికి వసతి, బస, వాహనాల కేటాయింపులో జిల్లా యంత్రాంగం తలమునకలైంది. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా శనివారం సాయంత్రం 6గంటలకు ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకోనున్నారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణసింగ్ కూడా రాబోతున్నారు. అసెంబ్లీ స్పీకర్ చింతకాలయ అయన్నపాత్రుడు మధ్యాహ్నం 3.30గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని.. సాయంత్రం పార్లమెంటు స్పీకర్‌కు స్వాగతం పలుకుతారు. ఇక, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు మధ్యాహ్నం 3గంటలకు తిరుపతికి చేరుకుని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తారు. ఇక, పార్లమెంటు స్టాండింగ్ కమిటీ శనివారం చేరుకోనుంది. రాష్ట్ర మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, సవిత, పయ్యావుల కేశవ్, వివిధ రాష్ట్రాలకు చెందిన ఉమెన్ ఎంపవర్‌మెంట్ సభ్యులు ఒక రోజు ముందే తిరుపతికి రానున్నారు. మరికొందరు తిరుమల శ్రీవారిని దర్శించుకుని అనంతరం మహిళా సాధికారత సదస్సుకు హాజరు కానున్నారు. ఈ సదస్సు ముగింపు కార్యక్రమానికి సోమవారం గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొనున్నారు.

రేపు తిరుపతికి సీఎం చంద్రబాబు

సీఎం చంద్రబాబు నాయుడు విజయవాడ నుంచి హెలికాప్టర్‌లో తాజ్‌హోటల్ సమీపంలోని హెలిప్యాడ్‌కు ఆదివారం ఉదయం చేరుకుంటారు. తిరుపతిలోని శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో జరిగే విట్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు విశ్వనాథం మనవరాలు కాదంబరి వివాహానికి ఉదయం 9గంటలకు హాజరవుతారు. తిరిగి రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. జాతీయ మహిళసాధికారత సదస్సు ప్రారంభకార్యక్రమంలో పాల్గొంటారు. డెలిగేట్లకు మధ్యాహ్నం ఆతిథ్యం ఇవ్వనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శుక్రవారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. హెలిప్యాడ్, రాహుల్ కన్వెన్షన్‌సెంటర్, శ్రీకన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలించారు. సీఎం పర్యటనలో అప్రమత్తంగా ఉండాలని ఎక్కడా చిన్న పొరబాట్లకు తావు ఇవ్వరాదని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ మౌర్య, ఏఎస్పీ రవి మనోహరాచారి, ఆర్డీవో రామమోహన్, డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ స్పీకర్ ఆలోచనతో కొత్త ఒరవడికి శ్రీకారం



ప్రసన్నకుమార్ సూర్యదేవర

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్పీకర్ ఆలోచనతో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టినట్లు శాసనవ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర తెలిపారు. తిరుపతిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'పార్లమెంట్‌లో మహిళ స్వశక్తీకరణ కమిటీలో 20మంది లోక్‌సభ, పదిమంది రాజ్యసభ సభ్యులు ఉంటారు. లోక్‌సభ సభ్యులలో ఒకరు చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ప్రస్తుతం దగ్గుబాటి పురందేశ్వరి ఈ కమిటికీ చైర్‌పర్సన్. ఇలాంటి కమిటీలే అన్ని రాష్ట్రాల శాసనసభలు, శాసనమండలిలలో ఉంటాయి. గతంలో ఏ కమిటీకి ఆ కమిటీ.. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం.. పనిచేసుకునేవి. ఆ విధానానికి స్వస్తి పలికి, అన్ని రాష్ట్రాలలో జరిగే విషయాలను అందరూ తెలుసుకోవాలన్న ఉద్దేశ్యంతో లోక్‌సభ స్పీకర్ తీసుకున్న చొరవతో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నారు. మన రాష్ట్రంలో నిర్వహించే ఈ సదస్సు మూడోది. ప్రతి రాష్ట్రం నుంచి వచ్చే ప్రతినిధులు ప్రధానాంశాలపై చర్చిస్తారు' అని ఆయన వివరించారు.

సదస్సుకు 11 ఎలక్ట్రిక్ బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా సాధికారత సదస్సుకు హాజరుకానున్న ప్రజాప్రతినిధులు, అధికారుల కోసం 11 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ కేటాయించింది. ఆదివారం ఉదయం విమానాశ్రయం నుంచి రాహుల్ కన్వెన్షన్, అక్కడి నుంచి చంద్రగిరి కోట, తిరుమల, సోమవారం శ్రీకాళహస్తి, ఎయిర్‌పోర్టుకు నడుస్తాయి. డీపీటీవో జగదీష్ ఆధ్వర్యంలో బస్సులను ఎంపిక చేసి, అవసరమైన మార్పులు చేర్పులు చేస్తున్నారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లను కేటాయించారు.

సంప్రదాయ దుస్తుల్లో హాజరు కండి

రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సుకు సంప్రదాయ దుస్తుల్లో విధులు నిర్వర్తించాలని అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ దిశానిర్దేశం చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో శుక్రవారం విధులు కేటాయించిన నోడల్, లైజన్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతున్నట్లు చెప్పారు. నోడల్ అధికారులే కాకుండా ప్రతి రాష్ట్రానికి సూపర్‌వైజింగ్ నోడల్ అధికారులను నియమించామన్నారు. అతిథులు వచ్చినప్పటి నుంచి తిరిగి వెళ్లేంత వరకు అధికారులు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. లైజన్ అధికారులు అతిథులకు స్వాగతం నుంచి బస ఏర్పాటు చేసిన చోటు వరకు జాగ్రత్తగా చేరుకునేలా చూడాలన్నారు. పోలీసుశాఖ బందోబస్తు ఏర్పాట్లను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలన్నారు. అతిథులకు తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి దర్శనాలకు సంబంధించిన ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. డెలిగేట్లు బస చేసే హోటళ్ల వద్ద అంబులెన్సు, వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో జాతీయ మహిళా సాధికారత సదస్సును విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జేసీ శుభం బన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా సూక్ష్మసేద్యాధికారి బదిలీ

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా సూక్ష్మసేద్యాధికారి, ఫుడ్ ప్రాసెసింగ్ డైరెక్టర్ జి.సతీష్ పదోన్నతిపై డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ కడప జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయనగరం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ చిన్నరెడ్డెయ్య రానున్నారు.



సతీష్

వ్యవసాయ వర్సిటీ రిజిస్ట్రార్‌గా రమణ

- బాధ్యతల స్వీకరణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ నూతన రిజిస్ట్రార్‌గా డాక్టర్ ఎంవీ రమణ నియమితులయ్యారు. ఇప్పటివరకూ రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన డాక్టర్ రామచంద్రరావు డీన్ ఆఫ్ అగ్రికల్చర్‌గా వెళ్లారు. దీంతో రిజిస్ట్రార్‌గా రమణను అంటిల్ ఫర్ ద ఆర్డర్ ప్రాతిపదికన నియమించారు. చిత్తూరుకు చెందిన రమణ ఇరిగేషన్ ఇంజినీరింగ్, నీరు, భూసార సంరక్షణ రంగాల్లో చాలా అనుభవాన్ని గడించారు. 7 పీజీ, 2 పీహెచ్‌డీలకు మార్గదర్శకులుగా వ్యవహరించారు. పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. 2013లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు అందుకున్నారు. 2015లో ఏపీ కృష్ణయ్య స్మారక బంగారు పతకాన్ని యూనివర్సిటీ నుంచి స్వీకరించారు. తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా పని చేశారు. వ్యవసాయ యూనివర్సిటీలో 34 ఏళ్లుగా బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో కృషి చేశారు. శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన్ను పలువురు అభినందించారు.

పెట్టుబడులతో రండి 6

- పర్యాటక రాన్ని అభివృద్ధి చేద్దాం
- ఇన్వెస్టర్లకు మంత్రి కందుల దుర్గేష్ పిలుపు
- తిరుపతిని మైస్ టూరిజం, యాంకర్ హబ్‌గా చేస్తామని ప్రకటన



శరవేగంగా క్రికెట్ స్టేడియం నిర్మాణం

వచ్చే నెలాఖరుకు సిద్ధం చేసేందుకు సన్నాహాలు



తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరునగరిలోని గొల్లవానిగుంటలో మినీ క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులు ఎట్టకేలకు జోరందుకున్నాయి. గతంలో తొమ్మిదేళ్ల క్రితం స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మాణ పనులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. వైసీపీ హయాంలో పనులు నత్తనడకన సాగాయి. రూ.2.5కోట్ల వ్యయంతో మైదానం చదును, హెడ్‌లైట్స్, వాటర్‌డ్రై సిస్టమ్, పిచ్, పచ్చిక, ప్రహరీ, విద్యుత్ సదుపాయం వంటి పనులకు నాలుగేళ్లు పట్టింది. సగం మేర పూర్తయినా పనుల్లో నాణ్యత లోపించిందనే విమర్శలున్నాయి. ఈక్రమంలో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక శాప్ చైర్మన్ రవినాయుడు శ్రద్ధ పెట్టారు. శాప్, స్మార్ట్‌సిటీ చెరోసగం నిధులు భరించేలా కలెక్టర్ వెంకటేశ్వర్ సమక్షంలో ఒప్పందం జరిగింది. పెవిలియన్, కారుపార్కింగ్, అధునాతన పిచ్, అదనపు క్రీడాంశాల వేదికలను సిద్ధం చేయదలచారు. దీంతో మరో రూ. 2.5కోట్ల మేర శాప్ నిధులతో ఈఏడాది జూలైలో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. పెవిలియన్‌తోపాటు గ్యాలరీలు, డ్రస్సింగ్ రూమ్స్, క్యాంటీన్,ప్రత్యేక గదుల పనులు ఊపందుకున్నాయి. ప్రాక్టీస్ పిచ్‌లు, కార్‌పార్కింగ్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ కోర్టుల పనులు కూడా త్వరలో ప్రారంభంకానున్నాయి. వచ్చే నెలాఖరుకు మినీ క్రికెట్ స్టేడియాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేసేందుకు సిద్ధమవుతున్నారు. నగరంలో తొలి క్రికెట్ స్టేడియాన్ని సకల సౌకర్యాలతో ముస్తాబు చేస్తున్నామని రవినాయుడు చెప్పారు. క్రికెట్‌తో పాటు టెన్నిస్, షటిల్, కబడ్డీ, వాలీబాల్, కబడ్డీ క్రీడాంశాల వేదికలను అదనంగా తీసుకొస్తామన్నారు.

గత పాలకవర్గ తప్పిదాలపై తదుపరి విచారణకు ఆమోదం

- డీసీసీబీ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో సభ్యుల సిఫార్సు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత పాలకవర్గ హయాంలో జరిగిన ఆర్థిక విధ్వంసం, అవినీతి, అక్రమాలపై తదుపరి విచారణకు జిల్లా సహకార బ్యాంకు ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. శుక్రవారం స్థానిక బ్యాంకు ప్రధాన కార్యాలయ ఆవరణంలో చైర్మన్ అమాస రాజశేఖర రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. డీసీవో లక్ష్మి మాట్లాడుతూ వైసీపీ సర్కారు హయాంలో అప్పటి చైర్‌పర్సన్ రెడ్డెమ్మ నాయకత్వంలో అప్పటి నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ బృందం పెద్దఎత్తున అవినీతికి పాల్పడిందంటూ వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిందన్నారు. డీఆర్వో మోహన్‌కుమార్ వందమందికి పైగా సాక్షులను నాలుగు నెలల వ్యవధిలో విచారించి కలెక్టర్‌కు నివేదిక అందించారని చెప్పారు. ఆ నివేదికలో అంశాలపై సభ్యుల అభిప్రాయాలను తెలుసుకొని తదుపరి చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. దాంతో సమావేశం ఏకగ్రీవంగా తదుపరి విచారణకు ఆమోదం తెలుపుతూ అప్పటి పాలకవర్గంపై విచారణ కొనసాగించాలని సిఫార్సు చేసింది.బ్యాంకుకు జరిగిన నష్టాలను వారినుంచే రాబట్టాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు నిష్పక్షపాతంగా తదుపరి విచారణ జరపాల్సిందేనని కోరారు. చైర్మన్ రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ ఈ నెలాఖరుతో ముగియనున్న ఖరీఫ్ పంట కాలంలో స్వల్పకాలిక రుణాల రూపేణా రూ.3 లక్షలు, దీర్ఘకాలిక రుణాల రూపేణా యూనిట్ ఆధారంగా రూ.20 లక్షల వరకు, స్వల్పకాలికేతర రుణాలుగా పంట రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉందన్నారు. గ్రామీణ గృహ తనఖా కింద రూ.5 లక్షల వరకు, పీఎం సూర్యఘర్ పథకం కింద ఒక్కొక్కరికి రూ.3 లక్షల వరకు పరిమితి లేకుండా విరివిగా రుణాలందించాలని సింగిల్ విండోల అధ్యక్షులకు సూచించారు. ఈ రుణాల ద్వారా సంఘాలను లాభదాయక మార్గాల్లో నడిపి గ్రామీణ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.బ్యాంకు సీఈవో శంకర్ బాబు, డీసీఏవో నారాయణమ్మ, ఏజీఎం సురేష్ బాబు, లీగల్ ఆఫీసర్ వై. గంగిరెడ్డి, 75 సింగిల్ విండోల అఫిషియల్, నాన్ అఫిషియల్ కమిటీల చైర్మన్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర రెడ్డి



సత్యపాల్ సింగ్ బాగల్ - జస్టిస్ అవినాష్ జింగన్ - అనిరూధ్ - సప్తగిరి - సుధా

శ్రీవారిసేవలో ప్రముఖులు


తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో కేంద్రమంత్రి సత్యపాల్‌సింగ్ బాగల్, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అవినాష్ జింగన్, రాజస్థాన్ మంత్రి కన్హయ్య లాల్ చౌదరి, జార్ఖండ్ మాజీ సీఎం సర్యూరాయ్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఉన్నారు. ఇంకా సంగీత దర్శకుడు అనిరుధ్, నటి సుధా, నటుడు సప్తగిరి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

17న తైక్వాండో క్రీడాకారుల ఎంపిక

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో ఈ నెల 17న అండర్ 14, 17, 19 బాలబాలికల తైక్వాండో, స్విమ్మింగ్ జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు కిషోర్‌కుమార్, భార్గవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకున్న వారు అర్హులని, ఆసక్తిగల బాలబాలికలు సొంత క్రీడా సామగ్రితో హాజరుకావాలని కోరారు. హెచ్‌ఎం నుంచి వయస్సు ధ్రువీకరణ పత్రం, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు పదవ తరగతి ఒరిజినల్ మార్కులిస్టుతో రావాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలకు 8121777077(స్విమ్మింగ్), 9032956111 (తైక్వాండో)లను సంప్రదించాలని కోరారు.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణ తేజ విశ్రాంతి భవనం మీదుగా శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.81 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,312

తలనీలాలు సమర్పించినవారు: 27,728

గుడి తాళాలకీ, బండి తాళాలకీ
తేడా తెలీదా భూమనా?

● టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి



భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): 'ఏందయ్యా కరుణాకర్‌రెడ్డి గారు.. గతంలో రెండు సార్లు టీటీడీ ఛైర్మన్‌గా పనిచేశారు. మూడుసార్లు సభ్యుడిగా ఉన్నారు. బండి తాళాలకు, గుడి తాళాలకు తేడా కూడా తెలియదా మీకు?' అంటూ టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. తిరుమల శ్రీవారి ఆలయం ముం దు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, చంద్ర గ్రహణం రోజున మహద్వారం గేట్‌కు టీటీడీ సిబ్బంది తాళాలు వేస్తే ఛైర్మన్ సైన్యం చేతిలో తాళాలున్నాయని అబద్ధాలు ప్రచారం చేశారని చెప్పారు.టీవీ5 రిపోర్టర్ బండి తాళాలు పట్టుకుని మహ ద్వారం వద్ద ఫొటో దిగితే మహద్వారం గేటు తాళాలని అబద్ధాలు ప్రచారం చేశారు. మరి సాక్షి రిపోర్టరు కూడా అలానే ఫొటో దిగారు అది కనిపించలేదా కరుణాకర్‌రెడ్డీ అని నిలదీశారు. టీటీడీపై అసత్య, అబద్ధపు ప్రచారాలు చేసినా, ఫేక్ న్యూస్‌లు వేసినా క్రిమినల్ కేసులు పెట్టేలా రానున్న బోర్డు సమావేశంలో తీర్మానం చేస్తామని భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు.

తిరుమలలో దొంగ దొరికాడు

● 15 సెల్‌ఫోన్లు, 20 గ్రాముల బంగారు స్వాధీనం



పోలీసుల అదుపులో కిషోర్‌రెడ్డి, స్వాధీనపరుచుకున్న బంగారు, సెల్‌ఫోన్లు

తిరుమల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భక్తుల నుంచి సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాలు కొట్టేసే దొంగను తిరుమల పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 15 సెల్ ఫోన్లు, 20గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీన పరుచుకున్నారు. తెలంగాణలోని నల్గొండ జిల్లా, పాత సూర్యాపేటకు చెందిన మెట్టు కిషోర్‌రెడ్డి కొంతకాలంగా తిరుమలను కేంద్రం చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇతను గత నెలలో సీ టైప్ కార్వర్స్‌లోనూ ఇంటి తాళాలు పగల గొట్టి 20 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.40 వేల నగదు అపహరించినట్టు విచారణలో వెల్లడైంది. కిషోర్‌రెడ్డిని జ్యుడీషియల్ రిమాండ్ కోసం తిరుపతికి పంపారు.

ఇసుక అక్రమ రవాణాకు మైనర్లు

● పట్టించుకోని అధికారులు

రేణిగుంట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని స్వర్ణముఖి నది తీర ప్రాంతం నుంచి ఇసుకను యథేచ్ఛగా దోచుకోవడమే కాకుండా మైనర్లని ట్రాక్టర్ డ్రైవర్లుగా వినియోగించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. స్వర్ణముఖి నది తీర ప్రాంతంలోని జీపాళెం, పిల్లపాళెం, తాతయ్యకాలవ, గాజుల మండ్యం, పన్నీరుకాలువ, కొత్త మంగళం పరిసరాల్లో స్వర్ణముఖి నది తీరంతో పాటు, ప్రైవేటు భూముల్లో ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల పోటీతత్వంతో అధిక మొత్తంలో ఇసుకను రవాణా చేయాలని దురుద్దేశంతో కొంతమంది ఇసుకాసురులు ఏకంగా మైనర్లను కనీసం లైసెన్స్ లేకుండా ఇసుక అక్రమ రవాణాకు డ్రైవర్లుగా వినియోగిస్తున్నారు. రోడ్లపై జరగరానిది జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు స్పందించి బాలురతో ఇసుక రవాణా చేస్తున్న ఇసకాసురులపై చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ విషయంపై డీఎస్పీ శ్రీనివాసరావుని వివరణ కోరగా రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మైనర్లతో ఇసుక ట్రాక్టర్లను తోలిస్తే ఎక్కడికక్కడ వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఎంత కాలం విచారిస్తారో!



కాల్వ వంకలో నిర్మించిన రేకుల షెడ్డు, రూమ్..

రేణిగుంట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మా దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. ఇదీ ఆక్రమణలపై రెవెన్యూ అధికారుల స్టాక్ డైలాగ్. ఎంతకాలం విచారిస్తారో కానీ.. ఆ ఆక్రమణ స్థలాల్లో నిర్మాణాలూ జరిగిపోతుంటాయి. ఇలాంటిదే రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీ నీలసానిపేటలో చోటుచేసుకుంది. ఇక్కడి సర్వేనెం.1147లో కాలువ వంక 2.84ఎకరాల్లో విస్తీర్ణంలో ఉంది. గతంలో ఈ కాల్వ వంకలో సేద్యం చేస్తుండే వారు. ఆ తర్వాత రాత్రికి రాత్రే ఆ భూమిలో షెడ్ వెలిసింది. ఇందులో నిర్మాణాలు చేపడుతున్నట్టు ఇటీవల జరిగిన మండల సర్వసభ సమావేశంలో ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చర్యలు తీసుకుంటామని ఆ సమావేశంలో రెవెన్యూ అధికారే చెప్పారు. కానీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. ఆ తర్వాత ఆక్రమణదారులు ఇళ్ల నిర్మాణానికి గుంతలు తవ్వారు. ఇలా చూస్తుండగానే ఇంటి నిర్మాణమూ పూర్తయ్యేలా ఉందే కానీ.. అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు.



పక్కనే ఇంటి నిర్మాణానికి తవ్విన గుంతలు

స్కిట్‌లో తరగతుల ప్రారంభానికి సన్నద్ధం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూతో అనుబంధంగా స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో తరగతులు త్వరలో ప్రారంభించడానికి సర్వం సన్నద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే సుధీర్, అనంతపురం జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు సంయుక్తంగా తెలిపారు. నాలుగేళ్ల క్రితం మూతపడిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను తెరిపిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా గత నెలలో ఆ ప్రక్రియ పూర్తి చేసిన విషయం తెలిసిందే. రెండో విడత ఏఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా స్కిట్ కళాశాలలో అడ్మిషన్ల కోసం వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. అలాగే మూడో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా మళ్లీ ఇదే కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్లు పొందేందుకు అవకాశం కల్పించారు. శుక్రవారం ఎమ్మెల్యే, జేఎన్‌టీయూ వీసీ కళాశాలను సంయుక్తంగా పరిశీలించారు. మొదటి సంవత్సరం నిర్వహణ కోసం యుద్ధప్రాదికన సిద్ధం చేస్తున్న తరగతి గదులు, డిజిటల్, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించారు. ముక్కంటి ఆలయం సహాయంతో విద్యార్థులకు వసతి సదుపాయం కల్పిస్తున్న అంశంపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో మూడో విడత కౌన్సెలింగ్ ముగిసిన వెంటనే తరగతి గదులు ప్రారంభమవుతాయన్నారు. స్థానిక విద్యార్థులు మూడో విడత కౌన్సిలింగ్‌లో అడ్మిషన్లు పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, మోహీద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



స్కిట్ కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, వైస్ ఛాన్సలర్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బాఘేల్

చంద్రగిరి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్థిక లబ్ధికోసం మహిళలు పాల ఉత్పత్తి మాత్రమే కాకుండా కోళ్ల పెంపకం, చేపల సాగు, పందుల పెంపకం వంటి రంగాలలోనూ రాణించాలని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బాఘేల్ సూచించారు. చంద్రగిరి మండలం మల్లయ్యపల్లెలోని శ్రీజ డెయిరీ మహిళా పాల ఉత్పత్తిదారుల సంస్థను గురువారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన శ్రీజలో సంస్థలో ఉన్న మహిళా పాడి ఉత్పత్తిదారులతో సంభాషించారు. సంస్థ నిర్వహణ విధివిధానాలను పరిశీలించారు. పాల ఉత్పత్తిదారులతో శ్రీజ సంస్థ అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.



శ్రీజ డెయిరీని పరిశీలిస్తున్న మంత్రి ఎస్పీ సింగ్ బాఘేల్

నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్, డెయిరీ సర్వీసెస్ శ్రీజ సంస్థకు అందిస్తున్న సహకారాన్ని అడిగి తెలుసుకున్నారు. దేశంలోనే డెయిరీ రంగ అభివృద్ధిలో శ్రీజ సంస్థ భాగస్వామ్యాన్ని ఆయన ప్రశంసించారు. పంచాయితీ రాజ్ వ్యవస్థల ద్వారా అనేక గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళల చురుకైన పాత్ర పోషించాలని తెలియజేశారు. అనంతరం మహిళా పాల ఉత్పత్తిదారులను లాఖ్‌పతి దిదీస్‌లను ఎంపిక చేసి మంత్రి ఘనంగా సత్కరించారు. తర్వాత మల్లయ్యపల్లె టీడీపీ నాయకుడు బీగాల మహేష్ రాయల్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేంద్రమంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీజ కంపెనీ సీఈఓ తిమ్మప్ప, హెడ్ రాజేంద్రబాబు, పీబీఐ హెడ్ నిశాంత్, తిరుపతి ఏరియా మేనేజర్ రమేష్, పీబీఐ మోహన్, తహసీల్దార్ శివరామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'మెడికల్ డైలాగ్స్'లో ఆంధ్రజ్యోతి కథనం

తిరుపతి, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య రంగానికి సంబంధించి జాతీయస్థాయిలో విశ్వసనీయత కలిగిన 'మెడికల్ డైలాగ్స్' వెబ్ న్యూస్‌లో నిబంధనలు పాటించని స్విమ్స్ నోటిఫికేషన్ అంశాన్ని ప్రస్తావిస్తూ శుక్రవారం ఓ కథనం రాసుకొచ్చింది. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'చదువు చెప్పిన చోటే వద్దంటోంది' శీర్షిన ప్రచురితమైన వార్తను ఉటంకించింది. అదేవిధంగా డెంటిస్ట్రీ పోస్టును మార్చిన తీరును ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అంశాన్నీ ప్రస్తావించింది. మెడికల్ డైలాగ్స్ నుంచి వార్తాంశాలను వైద్య, ఆరోగ్య రంగం కీలకంగా పరిగణిస్తుంటోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) కూడా సదరు వెబ్‌సైట్‌లోని అంశాలను అనుసరిస్తుంటోందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. స్విమ్స్ నోటిఫికేషన్ లోపాలను స్థానిక మీడియా కథనాలు ప్రచురిస్తోందని మెడికల్ డైలాగ్స్ తన కథనంలో పేర్కొంది. వైద్య అభ్యర్థులు సదరు వెబ్ లింక్‌ను వైరల్ చేస్తే తమ వెతలను వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు చెబుతున్నారు.

తల్లీ కూతుళ్ల కిడ్నాప్

● నిందితులపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇక, వివాహేతర సంబంధం మానేద్దామన్న వివాహితను బెదిరించాడు. ఆమెను, ఆమె తల్లిని కిడ్నాప్ చేసి దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై కిడ్నాప్, హత్యాయత్నం కింద ఈస్ట్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. తిరుపతికి చెందిన ఓ వివాహిత ఇంటి వద్ద టైలరింగ్ పనులు చేస్తోంది. ఈమె భర్త సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఈ క్రమంలో కొర్లగుంటలోని అజీమ్‌తో ఈమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం ఎక్కడ ఇంట్లో తెలిసిపోతుందనే ఆలోచనతో ఆమె సంబంధం తెంచుకోవాలని అజీమ్‌కు చెప్పింది. దీనికి అతడు అంగీకరించలేదు. ఈ క్రమంలో లక్ష్మీపురం సర్కిల్‌లోని జిమ్ వద్దకు రావాలని ఆ మహిళ, ఆమె తల్లికి ఫోను చేశాడు. డ్రైవర్ బబ్లూతో కలిసి వారిని బలవంతంగా కారులో తీసుకెళ్లాడు. తన ప్రేమ కాదంటే ఇద్దరినీ చంపి తగుల బెడతానని బెదిరించి దాడి చేశాడు. దీనిపై బాధితులు 112కు ఫోన్ చేసి తమను కిడ్నాపర్ల బారి నుంచి కాపాడాలని పోలీసులను వేడుకున్నారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో కలసి ఘటనా స్థలికి చేరుకుని వారి ఆచూకీ కోసం గాలించారు. అజీమ్ వాడుతున్న మొబైల్ నెంబరు ఆధారంగా వారిని గుర్తించి లక్ష్మీపురం సర్కిల్ వద్ద మాటు వేసి పట్టుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఆయన చెప్పారు.

యాంకర్ హబ్‌గా తిరుపతి

జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల గమ్యస్థానంగా తిరుపతిని తీర్చిదిద్దుతాం

ప్రాంతీయ పెట్టుబడిదారుల సమావేశంలో మంత్రి దుర్గేష్



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'పెట్టుబడులతో రండి. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేద్దాం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిద్దాం' అంటూ ఇన్వెస్టర్లకు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన ప్రాంతీయ పెట్టుబడిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ, తిరుపతిల్లో పర్యాటకరంగ అభివృద్ధికి సంబంధించి ప్రణాళికను వివరించారు. తిరుపతిని మైస్ టూరిజం సెంటర్‌గా, ఓ యాంకర్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు. శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చే భక్తులు రెండు మూడు రోజులు ఇక్కడే ఉండి ఇతర పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. దీనికోసం చంద్రగిరి కోట, ఎస్వీ జూపార్కు, తలకోన, సూళ్లూరుపేట, నేలపట్టులోని పక్షుల విహార కేంద్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో పర్యాటకుల వసతికి అవసరమైన స్టార్ హోటళ్లు, రిసార్టులు, కాటేజీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అంచనా మేరకు క్యారవాన్ టూరిజంకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. శేషాచలం అడవుల్లో అడ్వెంచర్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్, ట్రెక్కింగ్ తదితర ప్రక్రియను ప్రవేశపెడితే బాగుంటుందని ఆలోచిస్తున్నట్టు చెప్పారు. ఎర్రచందనం లభిస్తున్న ఈ ప్రాంతంలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామన్నారు. తిరుపతి ప్రాంతంలో అటవీ, దేవదాయ, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎకో టూరిజం అభివృద్ధికి ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. కోనసీమలోని మండువాల తరహాలో తిరుపతిలో పాతకాలం నాటి ఇళ్లలో, పురాతన కట్టడాలలో హోమ్‌స్టేలు ఏర్పాటు చేస్తామన్నారు. స్పష్టమైన ప్రతిపాదనలతో, ఆలోచనతో పర్యాటక అభివృద్ధికి ముందుకొచ్చే ఇన్వెస్టర్లకు ప్రభుత్వం అవసరమైన భూమి, రాయితీలు, ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు త్వరితగతిన జారీ చేస్తామన్నారు. ఇన్వెస్టర్లపై భారం పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. హోమ్‌స్టేలు, పర్యాటక పాలసీకి సంబంధించిన మార్గదర్శకాలను ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి వివరించారు. పెట్టుబడిదారులకు ఏ ఇబ్బంది వచ్చినా తాను పరిష్కరిస్తానని, అనుమతుల మంజూరు తదితరాల విషయంలో అండగా ఉంటానని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, కలెక్టర్ వెంకటేశ్వర్, నరసింహ యాదవ్, సుగుణమ్మ, పసుపులేటి హరిప్రసాద్, టూర్ ఆపరేటర్స్ అసోయేషన్ అధ్యక్షుడు విజయ్ మోహన్, సీఐఐ దామోదర నాయుడు, ఔత్సాహిక ఇన్వెస్టర్లు పాల్గొన్నారు.

● తిరుపతిని వ్యూహాత్మక పర్యాటక ప్రదేశంగా ప్రభుత్వం భావిస్తోంది. తిరుపతి మొదలు సమీప ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు పర్యాటక పెట్టుబడిదారులను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. అందులో భాగంగా స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) ద్వారా రూ3,482 కోట్ల విలువైన హాస్పిటాలిటీ ప్రాజెక్టులకు కేబినెట్‌లో ఆమోదం లభించింది. తద్వారా హోటళ్లలో 2,698 గదుల ఏర్పాటుకు అవకాశం ఉంది. సుమారు 11,645 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

● తిరుపతి సమీపంలో అట్మాస్పియర్, నోవాటెల్, మారియట్, ఒబెరాయ్, లెమన్ ట్రీ, మహేంద్ర తదితర సంస్థలతో రిసార్ట్, హోటళ్ల నిర్మించేందుకు ఎంవోయూలు చేసుకున్నాం. దుబాయ్ తరహాలో మీటింగ్, ఇన్సెంటివ్ కాన్ఫరెన్సులు, ఎగ్జిబిషన్ (మైస్) టూరిజంను అభివృద్ధి చేస్తాం.

● తహసీల్దారు కార్యాలయంలో

వీరంగం సృష్టించిన వ్యక్తిపై కేసు

రామచంద్రాపురం,సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం తహసీల్దారు కార్యాలయంలో వీరంగం సృష్టించి, అధికారులను దుర్భాషలాడిన పురుషోత్తంరెడ్డిపై కేసు ననమోదైంది. తహసీల్దారు మధుసూదన్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రెవెన్యూ అధికారుల కథనం మేరకు .. తన భార్య ఆధార్ కార్డులో అడ్రసు మార్పు కోసం వేపకుప్పం గ్రామానికి చెందిన పురుషోత్తంరెడ్డి ఆధార్ అప్లికేషన్‌లో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం కోసం ఈనెల 6న తహసీల్దారు కార్యాలయానికి వచ్చారు. తహసీల్దారు తన చాంబర్‌లో ప్రజా సమస్యలపై ఫిర్యాదు స్వీకరిస్తుండగా కాసేపు వేచి ఉండాలని పురుషోత్తంరెడ్డికి సిబ్బంది చెప్పారు. తాను ఎందుకు బయట వెయిట్ చేయాలంటూ ఆయన తహసీల్దారు చాంబర్‌లోకి వెళ్లి దరఖాస్తుపై సంతకం పెట్టాలని కోరారు. ఆధార్ కార్డులో తిరుపతి రూరల్ మండలం అని ఉండటంతో అక్కడి తహసీల్దారు చేత సంతకం చేయించుకోవాలని సూచించారు. దీంతో కోపోద్రిక్తుడైన పురుషోత్తంరెడ్డి 'నువ్వు పబ్లిక్ సర్వెంట్. సంతకం ఎందుకు పెట్టవు. మేముచెప్పిన చోట సంతకం పెట్టాలి. నీ కథ చూస్తా. కలెక్టర్‌కు నీపై ఫిర్యాదుచేస్తా' అంటూ దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఇంతలో గ్రామ రెవన్యూ అసిస్టెంట్లు మోహన్, గంగయ్య, గీత వారించినా వినలేదు. సిబ్బందిపైనా దుర్భాషలాడారు. దీంతో విధులకు ఆటంకం కలిగించి తమపై దౌర్జన్యానికి పాల్పడ్డాని తహసీల్దారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా సామాజిక అటవీ విభాగం

● డీఎఫ్‌వోగా పవన్‌కుమార్‌రావు

మంగళం, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): జిల్లా సామాజిక అటవీ సామాజిక విభాగం డీఎఫ్‌వోగా జీఎస్ పవన్‌కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు హోదాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా తిరుపతి బయోట్రిమ్‌లో డీసీఎఫ్‌గా పనిచేస్తున్న ఆయన డీఎఫ్‌వోగా నియమితులయ్యారు. అలాగే తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వోగా ఉన్న శ్రీనివాసులు సత్యసాయి జిల్లా సోషల్ ఫారెస్టు డీఎఫ్‌వోగా బదిలీ అయ్యారు. తిరుపతి ఎస్వీ జంతు ప్రదర్శనశాల డీసీఎఫ్‌గా, తిరుపతి సబ్ డీఎఫ్‌వోగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న నాగభూషణంను మంగళగిరి పీసీసీఎఫ్ కార్యాలయం డీసీఎఫ్‌గా బదిలీ చేశారు.

రూ.69.30లక్షలతో మూడు ల్యాబ్‌లు



ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాల

ఏర్పేడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏర్పేడులోని జడ్పీఉన్నత పాఠశాలలో మూడు ల్యాబ్‌లు ఏర్పాటు కానున్నాయి. ఒక్కో ల్యాబ్‌కు రూ.23.10లక్షలు మంజూరయ్యాయి. సైన్స్ ల్యాబ్, రెండు అటిజం సెంటర్లు రెండు ఏర్పాటు కానున్నాయి. సైన్స్ ల్యాబ్ ఏర్పాటుతో విద్యార్థులే సైన్స్‌లె మరింత పట్టుసాధించవచ్చు. గత ఐదేళ్లలో ఈ సెంటర్లు కావాలని ఉపాధ్యాయులు పదే పదే జిల్లా స్థాయి అధికారులకు ప్రతిపాదనలు పంపినప్పటికీ గత ప్రభుత్వంలో మంజూరు కాలేదు.

22 నుంచి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

తిరుచానూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 4.30గంటల వరకు ఆలయంలోని శ్రీకృష్ణస్వామి ముఖమండపం వద్ద పద్మావతి అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిస్తారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. అక్టోబరు 2వ తేదీ విజయదశమినాడు రాత్రి 7.45గంటలకు పద్మావతి అమ్మవారు గజవాహనపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తారు. **ఆర్జిత సేవలు రద్దు** : నవరాత్రి ఉత్సవాల కారణంగా ఆలయంలో ఈ పదిరోజుల పాటు కల్యాణోత్సవ సేవను రద్దు చేశారు. అదే విధంగా సెప్టెంబరు 26న లక్ష్మీపూజ సేవలు రద్దు చేశారు.



ఒక దాని వెనుక మరొకటి. ఇలా ఐదు భారీ కంటైనర్లు రేణిగుంట మండలం రామకృష్ణాపురం కూడలి సమీపంలో రోడ్డు పక్కన శుక్రవారం ఆపారు. తమిళనాడు రాష్ట్రం వేలూరు నుంచి అనంతపురం జిల్లా తాడిపత్రికి గాలి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే పరికరాలను తరలిస్తున్న ఈ కంటైనర్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడే నిలిపేశారు. భారీ వాహనాలు కావడంతో పగటిపూట వెళ్తే రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉండడంతో రాత్రి 10 గంటల తర్వాత బయలుదేరాయి.

- రేణిగుంట ఆంధ్రజ్యోతి

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

చినుకుపడితే చెరువే!



రామలింగయ్య గిరిజన కాలనీలో చెరువును తలపిస్తున్న వీధి

గూడూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం చెన్నూరు గ్రామంలోని రామలింగయ్య గిరిజన కాలనీలో అంతర్గత రోడ్డు చినుకుపడితే చెరువును తలపిస్తోంది. కాలనీలో సుమారు 200కు పైగా కుటుంబాలు ఉన్నాయి. చిన్నపాటి వర్షానికే ఓ వీధిలో రోడ్డుపై నీరు చేరి చెరువును తలపించేలా మారుతోంది. దీంతో రాకపోకలు సాగించడానికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పైప్రాంతంలోని వర్షపునీరంతా వీధిలోకి వచ్చి నిల్వ చేరడంతో పాటు తమ ఇళ్లలోకి వస్తుండడంతో అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గురువారం వేకువజామున కురిసిన చిన్నపాటి వర్షానికే వీధి జలమయంగా మారిందని, ఇంట్లో నుంచి కాలు బయటపెట్టాలన్నా పడాల్సివస్తోందనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రామలింగయ్య కాలనీలోని వర్షపునీరు నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగించొద్దు



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య

దొరవారిసత్రం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అంతరాయం లేని విద్యుత్ అందించాలని ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య అన్నారు. శుక్రవారం దొరవారిసత్రం 33 కేవీ సబ్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. సబ్ స్టేషన్‌లో సాంకేతిక పరమైన విషయాలపై సిబ్బందితో సమీక్షించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. విద్యుత్ అంతరాయం కలిగే ప్రాంతాల్లో శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కొమ్మల తొలగింపు పేరుతో ప్రతివారం విద్యుత్ సరఫరా ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించారు. లైన్ల కింద చెట్లు లేకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని, సాంకేతికంగా తరచూ మరమ్మతులకు గురయ్యే వాటిని గుర్తించి సరిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఈఈ శ్రీనివాసులు, డీఈలు శేఖర్, వరప్రసాద్, ఏఈలు జగదీష్, మోహిని, మురళి ఉన్నారు.

15నుంచి డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

గూడూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దస్తావేజు రిజిస్ట్రేషన్ విధానంలో ప్రభుత్వం తీసుకువచ్చిన ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని సీనియర్ డ్యాకుమెంట్ రైటర్ రాయసం సుబ్బారావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డ్యాకుమెంట్ రైటర్ల కార్యాలయం వద్ద డ్యాకుమెంట్ రైటర్ల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ విధానంలో ప్రభుత్వం తీసుకువచ్చిన ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 15నుంచి పెన్‌డౌన్ కార్యక్రమం చేపడతామన్నారు. పబ్లిక్ డేటా ఎంట్రీ చేసిన తర్వాత ఏదైనా తప్పులు దొర్లితే వాటిని సరిచేసుకునే వెసులుబాటు సబ్‌రిజిస్ట్రార్లకు ఉండేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయడం వల్ల సబ్ రిజిస్ట్రార్‌కు ఎడిటింగ్ చేసే అవకాశం లేకుండా పోయిందన్నారు. రిజిస్ట్రేషన్‌కు ముందు తప్పులు ఉంటే సరిచేసుకునేందుకు వీలులేకపోవడం వల్ల మళ్లీ డేటా ఎంట్రీని మొదటి నుంచి చేయాల్సి ఉంటుందన్నారు. ఇది ఎంతో వ్యవప్రయాసలతో కూడుకున్నదని, డ్యాకుమెంట్ రైటర్లు, వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

17 నుంచి బీజేపీ సేవా పక్షోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురష్కరించకుని ఈనెల 17నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించనున్న సేవా పక్షోత్సవాపై సన్నాహక సమావేశం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని తాళ్వాయిపాడులోని పార్టీ కార్యాలయంలో జరిగింది. నరేంద్రరెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛత అభియాన్, మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలను చేపట్టాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్

బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు



ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ అమ్మవారి జాతర గురువారంతో ముగిసింది. ఉద్యోగాలు, వ్యాపారాలతో వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ స్థానికులు, బంధువులు జాతర సందర్భంగా వెంకటగిరి వచ్చారు. వారంతా తిరిగి వెళ్లేందుకు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచే ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. అయితే వెంకటగిరి డిపో నుంచి అరకొరగా బస్సులు సర్వీసులు నడుస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పైగా మహిళలకు ప్రయాణం కావడంతో బస్సులన్నీ నిండిపోయాయి. దీంతో ప్రయాణికుల మధ్య సీట్ల కోసం వాగ్వావాదం చోటుచేసుకుంది. రాపూరు, తిరుపతి, నాయుడుపేట, గూడూరు, నెల్లూరు మీదుగా వెళ్లాల్సిన బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పంటకాలువలో పైపుల తొలగింపు

గూడూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్‌శాఖ అనుమతులు లేకుండా పంటకాలువలో కొందరు అక్రమంగా ఏర్పాటు చేసిన పైపులను ఆశాఖ అధికారులు శుక్రవారం తొలగించారు. ఏఈ సురేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని పోటుపాళెం సమీపంలోని పంటకాలువలో కొందరు కాలువను దాటేందుకు ఇరిగేషన్‌శాఖ అనుమతులు లేకుండా అక్రమంగా పైపులను ఏర్పాటు చేసుకున్నారన్నారు. రైతులు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకురావడంతో పైపులను తొలగించామన్నారు. ఎవరైనా అక్రమంగా పంటకాలువలను ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఈ స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని 220 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో శనివారం ఉదయం 7నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ శేఖర్ తెలిపారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని జువ్వలపాళెం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మండబైలు, కారువారిమంచికండ్రిగ, శ్రీనివాసపురం ప్రాంతాల్లో శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ తెలిపారు.

16 నుంచి స్కూల్ గేమ్స్

కోట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కోటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 16, 17, 18 తేదీల్లో 69వ మండలస్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు ఎంఈవో మస్తానయ్య తెలిపారు. 16వ తేదీ బాలికలకు, 17, 18 తేదీల్లో బాలురకు పోటీలు జరుగుతాయన్నారు. ప్రతిభ చూపినవారిని డివిజన్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

నాయుడుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు శుక్రవారం టీడీపీ నాయకుడు జయరాజ్ గోపాల్ ఉచితంగా యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీణాకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆక్రమిత భూముల్లో పెంచుతున్న నిమ్మ తోటలు - సాగుకు సిద్ధం చేస్తున్న భూమి

మాచవరంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ

ఫిర్యాదు చేసినా స్పందించని రెవెన్యూ అధికారులు

ఓజిలి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం మాచవరంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ యధేచ్ఛగా సాగుతోంది. మాచవరం గ్రామానికి సమీపంలోనే నాయుడుపేట మండలంలోని మేనకూరు సెజ్ ఉండటంతో ఇక్కడి భూములకు విలువ పెరిగింది. దీంతో ప్రభుత్వ, బంజరు, పరంబోకు భూములు ఆక్రమణకు గురౌతున్నాయి. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోక పోవడంతో కబ్జాదారులు మరింతగా రెచ్చిపోతున్నారు. విలువైన భూములను ఆక్రమించుకుని నిమ్మ, సవక, జామాయిల్ వంటి తోటలను పెంచుకుంటున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన కొందరు విక్రయించి సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇందుకు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సర్వే నెంబరు 207, 39 సర్వే నెంబర్లలో 30 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూములను గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. వీరిలో ఓ ప్రభుత్వ అధికారి కూడా ఉండటం గమనార్హం. గత కొంతకాలంగా ఇక్కడి భూములపై కన్నేసిన కొందరు ఆక్రమణలకు పాల్పడుతుండడంతో గ్రామంలో వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సుబ్రహ్మణ్యం చెరువు కట్టపై కొంత దూరమే పోసిన మట్టి - గడ్డి చెక్కేసి మొక్కలు తొలగించిన వరవ కాలువ

మట్టిపోసి ముగించారు!

మొక్కుబడిగా చెరువు కట్ట, కాలువల పనులు

బాలాయపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) మండలంలోని సుబ్రహ్మణ్యం గ్రామంలోని రెండు చెరువులు, వరవ కాలువల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌డీఆర్ నిధులు రూ.9.85 లక్షలు మంజూరు చేసింది. ఇందులో ఒక చెరువుకు రూ.4.90 లక్షలు, మరొక చెరువుకు రూ.4.95 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో ఆయా చెరువు కట్టలను పటిష్ట పరచడంతో పాటు వరవ కాలువల్లో ఉన్న మొక్కలు తొలగించి అభివృద్ధి చేయాలి. అయితే చెరువు కట్ట చివరన కొంతమేర మట్టి తోలి చేతులు దులుపుకున్నారు. అదేవిధంగా సుబ్రహ్మణ్యం పెద్ద చెరువుకు నీరువచ్చే వరవ కాలువ, చిన్న చెరువులకు నీరువచ్చే వరవ కాలువల్లోనూ గడ్డి చెక్కేసి తూతూమంత్రంగా పనులు చేట్టారు. పనులు జరుగుతున్న సమయంలో అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో కాంట్రాక్టరు మొక్కుబడిగా మట్టితోలి చేతులు దులుపుకున్నారని రైతులు విమర్శిస్తున్నారు.

డ్రగ్స్‌ను తరిమికొడదాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెరైన్ సీఐ వెంకటేశ్వరరెడ్డి

కోట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అవగాహనతో మత్తు పానియాలు, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదామని మెరైన్ సీఐ వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని విద్యానగర్‌లో గల శ్రీనివాస జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెరైన్ సీఐ వెంకటేశ్వరరెడ్డి, ఎస్ఐ శివసొమ్య మాట్లాడుతూ విద్యార్థులు అవగాహన లోపంతో డ్రగ్స్ బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ప్రతి విద్యార్థి గ్రామాల్లోని యువతను చైతన్య పరచాలని, ఇందుకు మెరైన్ అధికారుల సహకారం ఉంటుందన్నారు. విద్యార్థులు చదువులపై ప్రత్యేక శ్రద్ధ వహించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు.

పోలేరమ్మ హుండీ లెక్కింపు



హుండీలో కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామశక్తి పోలేరమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని దేవదాయశాఖ ఈవో శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. రూ.22,21,350 నగదు, 1852 గ్రాముల బంగారం, 37 గ్రాములు వెండి వచ్చింది. 25 రోజుల్లో ఈ ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

వీఆర్‌ఏల వేతనాలు పెంచండి

కోట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బండెడు చాకిరీ చేస్తున్న తమపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపడం అన్యాయమని వీఆర్‌ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15వ తేదీన గూడూరులో నిర్వహించే ఆందోళనతో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని వీఆర్‌ఏలు శుక్రవారం తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. మండల వీఆర్‌ఏల అసోసియేషన్ నాయకుడు మణి మాట్లాడుతూ వీఆర్‌ఏలకు వేతనాలు పెంచడంతో పాటు అర్హులైన వారికి వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని కోరారు.

హిందీ దివస్

గూడూరు అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం హిందీ దివస్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ సభ హిందీనీ దేశ అధికారిక భాషగా ప్రకటించిన రోజును హిందీ దివస్‌గా జరుపుకుంటున్నామన్నారు. హిందీ ప్రాముఖ్యత, జాతీయతను పెంపొందించేలా విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, శారద, హరిబాబు, హరిబ్రహ్మ, పద్మజ, రషీద, సావిత్రి, చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ పోటీల్లో ప్రతిభ చాటాలి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో ప్రతిభ చాటి విజయం సాధించాలని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. శని, ఆదివారం రెండు రోజుల పాటు తూర్పుగోదావరి జిల్లా మండపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న జిల్లా జట్టు సభ్యులకు శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బకాయిలను చెల్లించండి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐ సాయితేజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు దయాకర్, అల్లెయ్య, వెంకటేశ్వర్లు నాయుడు, రాజేష్, ఆనంద్, పర్వీన్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



శారదను సత్కరిస్తున్న సర్పంచ్ ఆర్ముగం

తడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారం అందుకున్న పల్లిపాళెం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్‌వీ శారదను శుక్రవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్ముగం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రామదిన్, ఉపాధ్యాయులు భువనేశ్వరి, సుధాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

సూళ్లూరుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో శుక్రవారం నవజీన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ఆర్గనైజర్ బాలాజీ హెచ్ఐవీ వ్యాప్తికి గల కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు అనంతరం నాగరాజపురంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయబాబు రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన



ఎరువుల వాడకంపై సూచనలిస్తున్న ఏవో కాంచన

సూళ్లూరుపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎరువుల వినియోగంపై రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఏవో కాంచన మాట్లాడుతూ నానో లిక్విడ్ యూరియా వినియోగించడం వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. ఎకరా వరిపైరుకు 500 ఎంఎల్ లిక్విడ్ యూరియా పిచికారి చేస్తే సరిపోతుందన్నారు. అదేవిధంగా జీవన ఎరువులను వినియోగిస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం రైతులతో కలిసి మానవహారం చేశారు.

నాయుడుపేట టౌన్: నానో ఎరువులు వినియోగించడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారి గణేష్ అన్నారు. నానో ఎరువుల వాడకంపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు.

వాకాడు: పంట భూముల్లో సహజంగా ఉండే మిత్ర సూక్ష్మజీవ సంపదను కాపాడుకునేందుకు రైతులు విరివిగా జీవన ఎరువులను వాడుకొని భూములకు ఆరోగ్యరక్ష కల్పించాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి దీప అన్నారు. శుక్రవారం జీవన ఎరువులను వినియోగించడం వల్ల అధిక దిగుబడి పొందవచ్చన్నారు.

కోట: పట్టణలోటని బీసీ గురుకుల పాఠశాలలో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయశాఖ అధికారి సుచేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రైతులు యూరియాను ఎక్కువగా వాడటం వల్ల నేల భౌతిక స్వభావం దెబ్బతినడంతో పాటు చీడపీడలు ఎక్కువగా ఆశించడం జరుగుతుందన్నారు. ప్రత్యామ్నాయంగా బయో ఫర్టిలైజర్ నానో యూరియా, నానో డీఏపీలను నివియోగించడం వల్ల నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



అశ్రిత్ నంద

సూళ్లూరుపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి దర్శనానికి వచ్చి తిరిగి వెళ్లే సమయంలో రైల్వేస్టేషన్‌లో మూడేళ్ల బాలుడు తప్పిపోయాడు. ఆర్‌పీఎఫ్ ఎస్ఐ వెంకటస్వామి సమాచారం మేరకు... తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన జీ.సుబ్రహ్మణ్యం, నవ్య దంపతులు శ్రీసిటీలో ఓ పరిశ్రమలో పని చేస్తున్నారు. తడలో నివాసం ఉంటున్న వీరు శుక్రవారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. అమ్మవారి దర్శనానంతరం ఆలయ ఆవరణలో ఉన్న కుటుంబ కుటుంబ సభ్యులెవరికీ చెప్పకుండా సుబ్రహ్మణ్యం తన కుమారుడు అశ్రిత్ నందను తీసుకొని ఆటోలో రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. ఆటో దిగి ప్లాట్‌ఫారం వద్దకు వెళ్లే క్రమంలో అశ్రిత్ నంద తప్పిపోయాడు. రైల్వేస్టేషన్ సమీపంలో ఏడుస్తూ ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని స్థానికులు గుర్తించి ఆర్‌పీఎఫ్ పోలీసులు అప్పగించారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలించగా ఆటోలో వచ్చి దిగిన సుబ్రహ్మణ్యం కుమారుడిని పట్టించుకోకుండా నేరుగా మూడో ప్లాట్‌ఫారంలో ఉండే లోకల్ మెమూ ఎక్కి వెళ్లిపోయినట్లు గుర్తించారు. ఆటోలో బాలుడితో పాటు వచ్చింది ఎవరు, ఎందుకు పట్టించుకోకుండా వెళ్లిపోయడని ఆర్‌పీఎఫ్ పోలీసులు వివరాలు సేకరించే పనిలో పడ్డారు. ఇంతలో విషయం తెలుసుకున్న బాలుడి తల్లి నవ్య బంధువులతో కలిసి రైల్వేస్టేషన్‌కు వచ్చారు. సుబ్రహ్మణ్యంకు కొన్ని రోజులుగా మతిస్థిమితం లేదని, అమ్మవారి గుడికి వచ్చాక తమకు తెలియకుండా బాలుడిని తీసుకొచ్చేశాడని చెప్పారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు బాలుడిని తల్లికి అప్పగించారు.

సీతారాం ఏచూరి సేవలు మరువలేనివి



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీతారాం ఏచూరి చేసిన సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏచూరి వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశనుంచే ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. ప్రజలు హక్కులను కాపాడడం, సామాజిక న్యాయం కోసం ఆయన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. అనంతరం సీపీఎం కార్యాలయానికి సుబ్రహ్మణ్యంరెడ్డి సహకారంతో అందజేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రాంభించారు. కార్యక్రమంలో జోగి శివకుమార్, బీవీ రమణయ్య, వెంకట్రామిరెడ్డి, ప్రసాద్, చంద్రయ్య, శంకరయ్య, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, రఫీ, మున్నా, మధు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించేలా చర్యలు తీసుకోండి

గూడూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు ఇచ్చిన భూములకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌ను చిల్లకూరు మండలం మన్నేగుంట గ్రామస్తులు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. మన్నేగుంట గ్రామపరిధిలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి భూములను సేకరించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు నష్టపరిహారం అందించపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, త్వరితగతిన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిహారం అందించేలా చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే చెప్పారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన ఆర్మీ శిక్షణ తరగతులు

కోట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజుల పాటు జరిగిన శిక్షణ శుక్రవారం ముగిసింది. ఆర్మీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 35 మంది ఆఫీసర్లకు కల్నల్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ఆఫీసర్లుగా పనిచేయడానికి అవసరమైన శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారి గోవింద మాధవయ్య అభినందించారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం కోటపోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 11, 12న రెండు రోజుల పాటు మండల స్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో సూళ్లూరుపేట ట్రైనీటాట్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. 800 మీటర్ల పరుగు పందెంలో సీహెచ్ రేవంత్ మొదటి స్థానం, జయదీప్ ద్వితీయ స్థానంలో నిలిచారు. అదేవిధంగా బ్యాడ్మింటన్‌లో లక్ష్మీవల్లభ ప్రథమస్థానంలో నిలిచారు.

భూసార పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

వాకాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. శుక్రవారం జిల్లా వనరుల కేంద్ర సహాయ సంచాలకుడు శ్రీనివాసులు, సాయిల్ కన్జర్వేషన్ వ్యవసాయ అధికారి చక్రవర్తి, కేవీకే శాస్త్రవేత్త రాజీవని మట్టి నమూనాల సేకరణ, రసాయనిక విశ్లేషణ, యాప్ ద్వారా ఫలితాల నమోదు, సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీపై ఎస్‌హెచ్‌సీ మొబైల్ యాప్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారిణిలు సుధా, పరమేశ్వరి, దీప తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై అవగాహన

కోట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మట్టి నమూనా సేకరణ, భూసార పరీక్షల ప్రాముఖ్యంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ అధికారులు అన్నారు. కోటలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు తిరుపతి భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయ అధికారి పరమేశ్వరి ఆధ్వర్యంలో మట్టి నమూనాల సేకరణపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఏవో సుచేంద్రప్రసాద్, జిల్లా వనరుల కేంద్ర అధికారి వేణుగోపాల్, శాస్త్రవేత్త రాజీవన తదితరులు పాల్గొన్నారు.